


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 19-01-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 111 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### అన్న నందమూరి తారక రామారావు

# యుగపురుషుడు

- ఎన్టీఆర్ వైద్యసేవ పరిమితి రూ.5 లక్షలకు పెంపు
- రామారావును ఆదర్శంగా తీసుకోండి
- ఎన్టీఆర్ పార్కు, వావిలాల ఘాట్ ప్రారంభం
- ట్యాంక్‌బండ్ తరహాలో సత్తెనపల్లి పార్కు
- 36 అడుగుల ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం

సత్తెనపల్లి: గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ పార్కు, వావిలాల ఘాట్ ప్రారంభించారు. ఎన్టీఆర్ సాగర్‌లో సభాపతి కోడెల శివప్రసాద్‌రావుతో కలిసి బోటులో విహరించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లిలో 36 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ ఒక మహా నాయకుడు, యుగ పురుషుడు అని కొనియాడారు.

సత్తెనపల్లికి వన్నె తెచ్చేలా తారకరామసాగర్ ఏర్పాటు చేస్తామని హామీ తరువాయి 2లో..





## భారతదేశం
## ఆర్థిక సామర్థ్యం సాధించాలి

- వ్యాపారంలో అదే మన లక్ష్యం కావాలి
- నిరోధకాలను తొలగించండి
- పరిపాలనను పెంచడంపై దృష్టిసారిస్తాం
- గుజరాత్ సదస్సులో ప్రధాని మోదీ



గాంధీనగర్ : సులువుగా వ్యాపారం చేయడంలో వచ్చే ఏడాది కల్లా మన దేశం ప్రపంచంలోని తొలి 50 దేశాల్లో ఒకటి కావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. శక్తిమంతమైన గుజరాత్ సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌లో మన దేశం 75 స్థానాలను అధిగమించిందని, ప్రస్తుతం 77వ స్థానంలో నిలిచిందని చెప్పారు. వచ్చే ఏడాదికల్లా టాప్ 50లో చేరేందుకు వీలుగా మరింత శ్రమించాలని తన బృందాన్ని కోరినట్లు తెలిపారు.

భారత దేశం తన సామర్థ్యాన్ని సాధించడానికి అడ్డుపడుతున్న నిరోధకాలను తొలగించడంపై తన ప్రభుత్వం దృష్టి పెట్టిందని చెప్పారు. సంస్కరణల వేగాన్ని కొనసాగిస్తామన్నారు. సంస్కరణలు, పనితీరు, పరివర్తన, మరింత పని చేయడం అనే మంత్రాన్ని ప్రయోగించి ప్రభుత్వాన్ని తగ్గించి, పరిపాలనను పెంచడంపై దృష్టి సారించినట్లు తెలిపారు.

## పోచారం వివాద రహితుడు

### స్పీకర్‌గా పోచారం బాధ్యతలు .. కేసీఆర్ శుభాకాంక్షలు



హైదరాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన పోచారం శ్రీనివాసరెడ్డికి సీఎం కేసీఆర్ అభినందనలు తెలిపారు. స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు.

పోచారం రాజకీయ ప్రస్తానంలో వ్యవసాయ శాఖ నిర్వ హించడం ఉజ్వలమైన ఘట్టంగా ఆయన పేర్కొన్నారు. పోచారం హయాంలోనే తరువాయి 2లో..

### ఆదర్శ శాసనసభగా తీర్చిదిద్దుదాం

తెలంగాణ శాసనసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సీఎం కేసీఆర్, సభ్యులకు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సభలో తొలిసారిగా ఆయన ప్రసంగించారు. శాసనసభాపతి పదవి అత్యంత కీలకమని.. సభ నిర్వహణలో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం, సభకు అంతరాయం కలిగించడం గౌరవప్రదం కాదని.. ప్రజల తరువాయి 2లో..

## బాబూ! దుష్ప్రచారాలు తగదు

### మీ 40 ఏళ్ల చరిత్ర అవినీతిమయం

### ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్నది వైకాపా మాత్రమే

### వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి



తిరుపతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి సీఎం చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రాల హక్కులను సాధించే క్రమంలో కేటీఆర్ వైఎస్ జగన్ మధ్య భేటీ జరిగిందని అన్నారు. ఈ భేటీపై వక్ర భాష్యాలు చెబుతూ.. టీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీలు పొత్తు పెట్టుకుంటున్నాయని చంద్ర బాబు దుష్ప్రచారం ప్రారంభించారని విమర్శలు గుప్పించారు. బాబు నలభయ్యేళ్ల రాజకీయ చరిత్ర అవినీతి మయం, దుర్గంధ భరితం, భరింపశక్యం కానటువంటిదని ఎద్దేవా చేశారు. నందమూరి హరికృష్ణ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన కేటీఆర్‌తో రాజకీయ పొత్తుల గురించి మాట్లాడింది మీరు కాదా అని సూటిగా ప్రశ్నించారు. తిరుపతిలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన తరువాయి 2లో..

## ధోనీ మాయాజాలం..

### ఆసీస్‌పై వన్డే సిరీస్ కైవసం



వార్త 8వ పేజీలో..

## నేటి తరానికి ఎన్టీఆర్ స్ఫూర్తిప్రదాత

- ఆయన ఆదర్శాలకు పునరంకితంకండి
- పేదరికంపై గెలుపే ఆయనకు నిజమైన నివాళి
- నిరంకుశత్వాన్ని ఎదిరించండి
- భాజపాపై ధర్మపోరాటం చేస్తున్నాం
- రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చండి
- పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి: నేటి తరానికి ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రదాత అని తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆరే అని చెప్పారు. ఆయన ఆదర్శాలకు పునరంకింతం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. పేదరికంపై గెలుపే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అని చెప్పారు. సమాజ సేవలో చురుగ్గా పాల్గొని పేదల సేవకు పునరంకితం కావాలని సూచించారు.

పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడారు.

నిరంకుశత్వాన్ని ఎదిరించడం నేర్పింది ఎన్టీఆరేనని తెలిపారు. ఇప్పుడు నిరంకుశత్వం భాజపా రూపంలో.. పెత్తందారీ ప్రధాని మోదీ రూపంలో ఉందన్నారు.

అందుకే భాజపాపై ధర్మపోరాటం చేస్తున్నామన్నారు. ఎన్నికలకు ఇంకా 100 రోజులే ఉన్నాయని, తెదేపా ఘన విజయం సాధించాలని చెప్పారు. దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అన్నారు.

## మరణం లేని జననం ఎన్టీఆర్‌ది

### రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



శ్రీకాకుళంః నగర కార్పొరేషన్‌లో దివంగత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 23వ వర్ధంతి కార్యక్రమాలు ఉదయం 80 ఫీట్‌రోడ్‌లో గల నూతన జిల్లా టీడీపీ కార్యాలయంలో గల అన్న ఎన్టీఆర్ విగ్రహానికి, అనంతరం నగర టీడీపీ ఆధ్వర్యంలో 7 రోడ్ల కూడలిలో అన్న ఎన్టీఆర్ విగ్రహానికి, గౌరవ జిల్లా మంత్రి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పార్లమెంటు సభ్యుడు కింజరాపు రామ్మోహన్నాయుడు, ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, జెడ్పీ ఛైర్ పర్సన్ చౌదరి ధనలక్ష్మి , జిల్లా టీడీపీ అధ్యక్షుడు గౌతు శిరీష పుష్పమాలలతో ఘననివాళి అర్పించారు. అనంతరం మంత్రి, నాయకులు మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ ఆశయ సాధన కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మేము నిరంతరం శ్రమిస్తున్నామని సంక్షేమ కార్యక్రమాలు ఆంధ్రలో ఆ మహానుభావునితోనే ఆరంభం అయ్యాయని వాటిని సీఎం మరింతగా ఎక్కువ ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం పోరాటాలు చేస్తూ అన్న ఆశయాలు కొనసాగిస్తున్నామని తెలుగు జాతి ఉన్నంత వరకు ఎన్టీఆర్ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా ఉంటారని మరణం లేని జననం ఆయనిది అని కారణజన్ముడు ఆయన అని తెలుగు వారి ఖ్యాతి, కీర్తి, ప్రపంచం నలుమూలల చాటిచెప్పిన మహానాయకుడు ఎన్టీఆర్, యువతకు స్ఫూర్తి తరువాయి 2లో..





అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయితీ బిఆర్టీ కోలనీ, రామభద్రపురం కోలనీలో ఎన్టీఆర్ 23 వ వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకులు మళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సాయిలక్ష్మి, ఆద్వర్యంలో పేదలకు దుప్పట్లు, చీరలు, పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ పెంటకోట జగదీష్, పెంటకోట శ్రీను, వెంకటరావు, ఆడారి సత్తిబాబు, పొలమరశెట్టి నూకరాజు, కాండ్రేగుల రాజు, బుద్ద సాయి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీక్షేత్రమ్‌లో ధాన్యలక్ష్మికి ప్రత్యేక పూజలు

విజయనగరం: ప్రముఖ భారతీయ తత్త్వ దర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువై యున్న అష్ట లక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం ధాన్యలక్ష్మికి ప్రత్యేక పూజలు గావించారు. దేవాలయం ప్రధాన అర్చకులు అంపోలు లక్ష్మీ నరసింహాచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ధాన్యలక్ష్మికి పంచామృతాభిషేకాలు చేసారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 20న సీతారామ కళ్యాణం

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం శ్రీమద్రామయణప్రాంగణం శ్రీరామనారాయణంలో ఈ నెల 20వ తేదీ ఆదివారం ఉదయం సీతారామకళ్యాణం జరుగనుందని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం సీతారాములకు స్నపనము, అభిషేకము జరుగుతాయని అనంతరం ఉదయం 10 గంటలకు సీతారామకళ్యాణం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు

మొదటి పేజీ తరువాయి

## అన్న నందమూరి తారక రామారావు యుగపురుషుడు

ఇచ్చారు. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో ఎన్టీఆర్ హయాంలో బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే తరహాలో సత్తెనపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటైందన్నారు.

### ఇప్పటికైనా ప్రత్యేక హోదా ప్రకటించండి..

రాష్ట్ర విభజన తర్వాత ప్రజలు ఎంతో నమ్మకంతో తనను గెలిపించారని, రాష్ట్రానికి భాజపా మేలు చేస్తుందని భావించామన్నారు. కానీ, భాజపా ఆంధ్రప్రదేశ్‌కు నమ్మకద్రోహం చేసిందని మండిపడ్డారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే తెలుగుజాతి తిరుగులేని శక్తిగా ఆవిర్భవిస్తుందని చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవ పరిమితిని రూ.5లక్షలకు పెంచుతున్నామని అన్నారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసేందుకు కట్టుబడి ఉన్నట్టు పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ముందుకెళ్తున్నామని అన్నారు. కేంద్ర హోంమంత్రి శుక్రవారం కడపలో పర్యటిస్తున్నారని, హోదా విషయంలో మోసం చేసి మళ్లీ ఎందుకు వచ్చారని చంద్రబాబు ప్రశ్నించారు.

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలని చంద్రబాబు కోరారు.

## పోచారం వివాద రహితుడు

రైతుబంధు, రైతుబీమా పథకాలు వచ్చాయని.. కేబినెట్‌లో ఆయన లేకపోవడం ఒక విధంగా తనకు లోటేనని చెప్పారు. పోచారం స్థానంలో సమర్థుడికి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోనూ పోచారం పోరాడారని గుర్తు చేశారు. వివాద రహితుడిగా ఆయనకు మంచి పేరుందని, భగవంతుడు పరిపూర్ణమైన ఆరోగ్యం, ఆయుష్షును ఆయనకు ఇవ్వాలని కేసీఆర్ ఆకాంక్షించారు. స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవానికి సహకరించిన ప్రతిపక్ష సభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

తెరాస నుంచి హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, కాంగ్రెస్ నుంచి గండ్ర వెంకటరమణారెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంఐఎం సభ్యుడు అహ్మద్ బలాలా తదితరులు పోచారం సేవలను కొనియాడారు.

## ఆదర్శ శాసనసభగా తీర్చిదిద్దుదాం

ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా సభను నిర్వహించుకుందామని చెప్పారు. ప్రజలకు న్యాయం చేసే క్రమంలో సభ్యులంతా సహకరిస్తారని భావిస్తున్నానన్నారు. సభ్యులందరం కలిసి ఆదర్శ శాసనసభగా తీర్చిదిద్దుదామని పోచారం పిలుపునిచ్చారు. సభ గౌరవాన్ని ఇనుమడింపజేసేందుకు అంతా కలిసి పనిచేయాలని సూచించారు. అనంతరం సభను శనివారానికి వాయిదా వేశారు.

## బాబూ! దుష్ప్రచారాలు తగదు

మీడియాతో మాట్లాడారు. విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి కేసీఆర్ వస్తే ఆయనకు స్వాగత ఏర్పాట్లు చేసి దగ్గరుండి సపర్యలు చేస్తారు. మీ మంత్రివర్గ సహచరురాలు పరిటాల సునీత ఇంట్లో వివాహానికి ఆహ్వానిస్తారు. కేసీఆర్ తలపెట్టిన చండీయాగంలో పాల్గొంటారు. కానీ, మేం కేటీఆర్‌తో భేటీ అయితే బురద జల్లుతారు అని ధ్వజమెత్తారు. టీడీపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా ఎప్పుడైనా ఒంటరిగా పోటీ చేసిందా? అని ప్రశ్నించారు. చంద్రబాబు అనేక రుగ్మతలతో భాదపడుతున్నారని, కొత్తగా ఆయనకు మానసిక రుగ్మత కూడా వచ్చినట్లుందని వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరు వింటేనే వణికిపోతూ.. బాబుకు నిద్ర కూడా పట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఐదు కోట్ల ఆంధ్రుల ప్రయోజనాలు కాపాడటం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే విషయంలో మొదటినుంచి పోరాటం చేస్తున్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని ఉద్ఘాటించారు.

## మరణం లేని జననం ఎన్టీఆర్‌ది

అని ఎంతో మందికి రాజకీయ బిక్ష పెట్టిపెద్ద నాయకులు ను చేసారని , మన జిల్లాకు అన్నివిధాలగా అభివృద్ధి చేసి అభిమానించేవారని ,నిరంతరం రాష్ట్రాభివృద్ధి కోసం తెలుగు జాతి సంక్షేమం కోసం పనిచేస్తున్న టీడీపీ ను మళ్ళీ అధికారం లోకి తీసుకు రావాలని అదే ఆయనకు నిజమైన నివాళి అని ఆదిశగా ప్రజలు సహకరించాలని మద్దతు ఇవ్వాలని క్యాడర్ యావత్తు కష్టించి పనిచేయాలని పిలుపు నిచ్చారు, నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ మాట్లాడుతూ తెలుగు జాతి కోసం , వారి ఉనికి కోసం నిరంతరం శ్రమించి, బడుగు బలహీన, మహిళ ల అభివృద్ధి కోసంటీడీపీ పార్టీ ను స్థాపించి వారి సంక్షేమం కోసం పనిచేసిన ప్రజా నేత అన్న ఎన్టీఆర్‌కు భారతరత్న బిరుదు ఇవ్వాలని కోరారు, అనంతరం నగర అధ్యక్షుడు మరియు ప్రధాన కార్యదర్శి చిట్టి, నాగభూషణం, రాష్ట్ర హస్త కళల డైరెక్టర్ ఇప్పిలి తిరుమలరావు సహకారంతో 100 మంది మహిళలకు చీరలు, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యులు , జెడ్పీ చైర్ పర్సన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు చేతుల మీదుగా మహిళలకు అందించడం జరిగింది , అనంతరం జిల్లా ఎన్టీఆర్ ఫాన్స్ ఆధ్వర్యంలో సూర్యమహల్ జంక్షన్‌లో గల అన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పుష్ప మాలలతో నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, ఎంపీపీలు, శ్రీకాకుళం నియోజక వర్గం రెండు మండలాల నాయకులు, జిల్లా టీడీపీ నాయకులు, నగర టీడీపి డివిజన్ ఇంచార్జిస్, జన్మభూమి కమిటీ నాయకులు, మహిళా, యువత, నాయకులు సీబీఎం ఆర్మీ, నందమూరి వంశాభిమానులు, పార్టీ క్యాడర్ ,ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు ఎన్టీఆర్

విజయనగరం : నందమూరి తారకరామారావు సేవలు చిరస్మరణీయమని, తెలుగుజాతి ఉన్నంతవరకు ప్రజల గుండెల్లో నందమూరి చిరస్థాయిగా నిలిచి ఉంటారని కేంద్ర మాజీ మంత్రి, పార్లమెంట్ సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. ఎన్టీఆర్ 23వ వర్ధంతిని పురష్కరించుకుని పట్టణంలోని న్యూపూర్ణ జంక్షన్ వద్ద మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ యుగపురుషుడని కొనియాడారు. తెదేపాను స్థాపించిన కొన్ని నెలల్లోనే అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించారన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవం, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని శ్లాఘించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. జిల్లా మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు మాట్లాడుతూ ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో సమాజసేవకు కార్యకర్తలంతా పునరంకితమై పేదలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. పేదరికంపై గెలుపే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించేలా పార్టీ శ్రేణులంతా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. నందమూరి తారకరామారావుకి భారతరత్న ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నిజాయితీకి మారుపేరుగా, నమ్ముకున్న సిద్ధాంతాల కోసం చివరివరకు నిలబడి పోరాడిన ప్రజల మనిషి ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగుజాతి కీర్తిని ప్రపంచదేశాలకు తెలియజేసిన మహానుభావుడు దివంగత నందమూరి తారకరామారావు అని అన్నారు. మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ పేదల అభ్యున్నతికోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతీ తెదేపా కార్యకర్త నడుచుకోవాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు



సతీమణి సునీలా గజపతిరాజు, కుమార్తె అదితి గజపతిరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, విజయనగరం శాసనసభ్యురాలు మీసాల గీత, పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎన్ఎం రాజు, ఎఎంసి చైర్మన్ సైలాడ త్రినాథ్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బొద్దుల నర్సింగరావు, తెలుగుయువత అధ్యక్షులు కర్రోతు వెంకటనర్సింగరావు, పార్టీ సీనియర్ నాయకులు విజ్జపు ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకల మురళీమోహన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు డా.వి.ఎస్.ప్రసాద్, కార్యదర్శి మద్దాల ముత్యాలరావు, పట్టణ తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని చాటిచెప్పిన మహానీయుడు ఎన్ టిఆర్

### ఎమ్మెల్యే పంచకర్ల



అచ్యుతాపురం : తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని చాటిచెప్పిన మహానీయుడు మాజీ ముఖ్యమంత్రి , స్వర్గీయ నందమూరి తారక రామారావు అని విశాఖ జిల్లా రూరల్ టిడిపి అధ్యక్షులు , యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు .మండలంలో సెజ్ కాలనీలో నిర్వహించిన ఎన్ టిఆర్ 23 వ వర్థంతి వేడుకలలో పాల్గొని ఎన్ టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు .అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణి చేశారు .ఈ సందర్బంగా పంచకర్ల మాట్లాడుతూ ఎన్ టిఆర్ ఆశయాలను ,సిద్ధాంతాలను కొనసాగిస్తూ సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు .ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజాన రమేష్ కుమార్ ,టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జనపరెడ్డి నరసింగరావు ,టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ బైలపూడి భవాని రామదాసు ,కూనిశెట్టి రమణ అదిక సంఖ్యలో నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు .



దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ద0తి సందర్భంగా గ్రేటర్ విశాఖ 39 వ వార్డ్ లో మాజీ కార్పొరేటర్ సనపల సీతా రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సనపల వర్రపసాద్,మూల అప్పారావు,మరియు వార్డ్ మహిళ నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గున్నారు.

## వైయస్సాఆర్ పార్టీ అంటే .... ప్రజా సంక్షేమం:

### సమన్వయ కర్త చిన్న శ్రీను



విజయనగరం: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం తప్ప చంద్రబాబునాయుడులా రాజకీయ ప్రయోజనాలు కోసం పని చేయదని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను) స్పష్టం చేశారు.గురువారం స్థానిక సత్యాకార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధినేత జగన్ తెలంగాణ రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారకరామారావు కలవడాన్ని చంద్రబాబు నాయుడుతో పాటు ఆయన మంత్రులు, నాయకులు, అసభ్యపదజాలంతో దుర్భాషలాడడం, కె.సి.ఆర్‌తో ఆయన కలిసి పోయారని ఆరోపణలు చేయడం చూస్తే తెలుగుదేశం నాయకులకు ఓటమి భయం పట్టుకుందని స్పష్టమౌతోందన్నారు. వైసిపి, తెరాసతో కలిసి పోయిందని వారు దుష్ప్రచారం చేస్తున్నారని వచ్చే ఎన్నికలలో వైసిపి ఏపార్టీతో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా పోటీ చేస్తుందని తెలిపారు. కె.టి.ఆర్, జగన్‌మోహన్‌రెడ్డిల కలయికను ప్రజలు, వైసిపి శ్రేణులు స్వాగతిస్తున్నాయని జగన్‌మోహన్‌రెడ్డి ఏకైక లక్ష్యం రాష్ట్రానికి ప్రత్యేక హెూదాయేనని పేర్కొన్నారు.

ఎన్.డి.ఏ.ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫెడరల్‌ఫ్రంట్ ఏర్పడితే రాష్ట్రాల హక్కులు సాదన, అభివృద్ధి జరుగుతుందన్న అభిప్రాయంతోనే తెలంగాణా ముఖ్యమంత్రి పలురాష్ట్రాల ముఖ్యమంత్రులను, నాయకులను కలిసారనిగుర్తు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేకహెూదా సాధనకోసం ఆంధ్రప్రదేశ్‌లోగల 25మంది ప్లామెంటు సభ్యులు, తెలంగాణాలోని పార్లమెంటు సభ్యులు కలసి సంఖ్యాబలంతో కేంద్రంపై పోరాటం బలంగా ఉంటుందని జగన్‌మోహన్‌రెడ్డి మొదటనుండి చెబుతున్నారని అన్నారు. అవకాశవాదరాజకీయాలు నడుపుతూ పూటకొకమాటతో నిలకడలేని పాలన సాగిస్తున్నారనివిమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేకహెూదా అవసరంలేదని ప్రత్యేక ప్యాకేజీ చాలని చెప్పిన చంద్రబాబు మూడున్నరేళ్లు పాటు ఎన్.డి.ఏ.ప్రభుత్వంతో అంటకాగి మంత్రులుగా పనిచేసిన వారు ఏనాడు ప్రత్యేకహెూదాకోసం పోరాడలేదన్నారు.చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనాలే తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టదని శ్రీనివాసరావు అన్నారు.

విభజన చట్టంలో పదేళ్లు పాటు హైదరాబాదులో ఉండవలసిన అవకాశం ఉన్నప్పటికి చంద్రబాబునాయుడు తనఅవినీతి, అక్రమ కార్యకలాపాలకోసం అమరావతికి వచ్చారని ఆరోపించారు.

## టెండరు కం బహిరంగ వేలం ప్రకటన

విశాఖపట్నం: స్థానిక పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో నెలకొల్విన శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానం నందు పనులు నిర్వహించుటకు ఆసక్తిగల అభ్యర్థులనుండి టెండర్ కం బహిరంగ వేలం కొరకు దరఖాస్తులు ఆహ్వానించబడు చున్నవి. 21వ తేదీ ఉదయం సీల్డు టెండర్లు కోరబడుచున్నవని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలియజేశారు. అదే రోజు మధ్యాహ్నం టెండర్లు తెరువబడునని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి అమ్ముకొనుట మరియు మహా శివరాత్రి సందర్భంగా దేవాలయానికి, అమ్మవారి విగ్రహమునకు పెయింటింగ్ పనులు పూర్తి చేయుటకు, క్యూలైన్ నిర్మాణం నిమిత్తం, విద్యుత్ అలంకరణల కొరకు టెండర్లు కోరబడుచున్నవని తెలియజేయడమైనది. మిగిలిన వివరములకు దేవస్థాన కార్యనిర్వహణాధికారిని పని వేళలయందు సంప్రదించవలసినదిగా సిబ్బంది తెలియజేశారు.

## స్థానిక 25వ వార్డులో ఎన్టీఆర్ 23వ వర్ధంతి వేడుకలు



విశాఖ దక్షిణ 25 వార్డులో ఘనంగా జరిగిన స్వర్గీయ నందమూరి తారక రామారావు 23వ వర్దంతి వేడుకలు వార్డు తెలుగుదేశం పార్టీ కమిటి ఆద్వర్యములో ఘనముగా నిర్వహించడం జరిగింది, ముందుగ వార్డు లో వున్న స్వర్గీయ ఎన్టీయార్ నిలువెత్తు విగ్రహానికి పువ్వుల దండలు వేసి నివాళులు అర్పించిన పిదప, సుమారు వంద మంది నిరుపేదలకు దుప్పట్లు, బడి పిల్లలకు నోట్ పుస్తకములు, కార్యక్రమంలో పాల్గొన్నవారికీ స్వీట్స్, పండ్లు పంపిణి చేయడం జరిగింది,కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు స్వర్గీయ ఎన్టీయార్ యొక్క కీర్తి ప్రతిష్టలు కొనియాడుతూ, నేటి వర్తమాన సమాజములో స్వర్గీయ ఎన్టీయార్ లాంటి వ్యక్తిత్వం ను ఆదర్శం గా తీసుకొని ముందుకు పోవాలని, అదే విదముగా స్వర్గీయ ఎన్టీయార్ కి ఈ ఏడాది రిపబ్లిక్ దినోత్సవం నాడు కేంద్ర ప్రభుత్వం తెలుగు ప్రజల పట్ల ఏ మాత్రం గౌరవం వున్నా భారత రత్న అవార్డు ప్రకటించాలని డిమాండ్ చేయడమైనది. కార్యక్రమంలో 25వ వార్డు నాయకులు వాసుపల్లి దానేష్, మైలపిల్లి శ్రీను, కొల్లి సింహాచలం, తిత్తి సాయిబాలరాం,అబ్దుల్ హనీఫ్, మొదు గణేస్వరరావు,తిక్కడ మణి,స్వర్గీయ ఎన్టీయార్ అబిమానులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా నాయకుడు ఎన్టీఆర్

- ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం
- అన్న అడుగు జాడల్లోనే సీఎం చంద్రబాబు నాయుడు
- రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావు



కంచరపాలెం: శుక్రవారం స్థానిక 37వ వార్డు పరిధిలో గల ఇందిరానగర్-3 తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్, వార్డు టిడిపి అధ్యక్షుడు గంకల అప్పారావు అద్వర్యంలో దివంగత నేత స్వర్గీయ అన్న నందమూరి తారక రామారావు 23వ వర్ధంతి కార్యక్రమం జరిగినది .ఈ కార్యక్రమంలో ముందుగా ఎన్టిఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు వాడి ఆత్మ గౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి, ప్రతీ పేదవాడికి కూడు ,గూడు ,గుడ్డ ఉండాలనే ద్యేయంతో పని చేసిన వ్యక్తి, బడుగు బలహీన వర్గాల వారికీ రాజ్యాధికారాన్ని కట్ట బెట్టిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ ఎన్టిఆర్ అని, అయన మన మధ్య లేక పోయినా ప్రతీ తెలుగువాడి హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయారని, ఆయన కన్న కలలను సాకారం చేస్తున్న మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రము శరవేగంగా అభివృద్ధి చెందిందని .ఎన్టీఆర్ భరోసా పెన్షన్ రెట్టింపు చేసి ప్రతి పేదవాడి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని తెలియజేసారు .అలాగే ఆ మహానాయకులు ఇద్దరి అడుగుజాడల్లో నడుచుకొని నిండుమనసుతో ఆశీర్వదించి ఇప్పటి నుండే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి 2019లో జరగనున్న ఎన్నికలలో ముఖ్యమంత్రిగా తిరిగి చంద్రబాబుని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు .

ఈ కార్యక్రమం సందర్భంగ గంకల అప్పారావు ఆద్వర్యంలో లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ వారిచే రక్త దాన శిబిరం ఏర్పాటు చేయగా 53 మంది రక్త దానం చేసారు . వృద్దులకు పళ్ళు , బిస్కట్లు పంపిణి చేసారు . ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేసం పార్టీ కార్యదర్శి ఆవాల నారాయణ స్వామి ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ,మహిళలు , యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

# జర్నలిస్టుల అభ్యున్నతికి సహకారమందిస్తా

**విజేఎఫ్ నార్ల వెంకటేశ్వర భవన్‌కు లిఫ్ట్ మంజూరు .. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి సత్కారం**



విశాఖపట్నం: రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వైఎస్ఆర్ సీపీ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని, జర్నలిస్టుల అభ్యున్నతికి అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తామని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విజయసాయిరెడ్డిని వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకుని వారికి గల పలు సమస్యలను వివరించడం జరిగింది. సీతమ్మధారలో గల నార్ల వెంకటేశ్వరరావు భవన్ (విజెఎఫ్)కు లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని కోరగా తణమే లిఫ్ట్ సదుపాయం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం ఏర్పడితే ప్రస్తుతం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్న తాము విద్య, వైద్యం, క్రీడలు, పండుగలు నిర్వహిస్తున్నామని విజెఎఫ్ అధ్యక్షుడు శ్రీనుబాబు తెలియజేశారు. ఈ సందర్భంగా విజెఎఫ్ సభ్యులు విజయసాయిరెడ్డిని ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. విజెఎఫ్ ఉపాధ్యక్షుడు ఆర్. నాగరాజు పట్నాయక్, జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్, పాలకవర్గ సభ్యులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 'మీ సేవ' నిర్వాహకుల సమ్మెకు సిఐటియు మద్దతు

విశాఖపట్నం: గత రెండు రోజులుగా సమ్మె చేస్తున్న మీ సేవ కేంద్రాల నిర్వాహకుల పోరాటానికి సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ తమ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నది.

ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని మీసేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నట్లు సిటు నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఒక వైపు ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వక, మరో వైపు వేరే ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు మీ సేవా కేంద్రాలను పెట్టుకుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. జిల్లాలో ఉన్న సుమారు 970 మీ సేవా కేంద్రాల ద్వారా 32 డిపార్టుమెంట్లకు సంబంధించిన 320 పౌర సేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు. వీరికి నెలకు కనీసం వెయ్యి రూపాయలు కూడా ఆదాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వీరిపై అధికార్ల వేధింపులు కూడా ఎక్కువ కావడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సివచ్చింది. ఈ నేపధ్యంలో ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని మీ సేవా నిర్వాహకుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది.



ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ప్రముఖ వైద్యులు టీడీపీ నాయకులు డాక్టర్ సత్యవతి ఆటో డ్రైవర్లకు ఫస్టెడ్ కిట్లు రిక్షా కార్మికులకు బట్టలు, పళ్ళు పంపిణీ చేసారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవం నిలబెట్టాలి



విశాఖపట్నం: తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 23వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఆర్కే బీచ్‌లో పూలమాలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ నాడు తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం స్వర్గీయ నందమూరి తారక రామారావు నిలబెడ్తే నేడు కేంద్ర ప్రభుత్వం తెలుగు జాతిని అణచివేయుటానికి కృషి చేస్తోందని విమర్శించారు. తెలుగుజాతి ప్రజలందరూ సింహాలై గర్జించాలి అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రంపై చేస్తున్న పోరాటానికి రాష్ట్ర ప్రజలందరు సమైఖ్యంగా నిలబడాలని రామ్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొ॥ వి. బాలమోహన్‌దాస్, మాజీ ఉప కులపతి నాగార్జున యూనివర్సిటీ, కాకర్ల సుజాత, తెలుగుశక్తి కార్యదర్శి వి.వంశీబాబు, లాడే కిషోర్ కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# భాషపై పట్టు సాధిస్తే, రచనల్లో స్పష్టత ఉంటుంది

## ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఏ.క్రిష్ణారావు

ఆంధ్ర విశ్వకళాపరిషత్ : తెలుగు సాహిత్యం, భాషపై పట్టు సాధిస్తూ జరిపే రచనల్లో స్పష్టత ఉంటుందని ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఏ.క్రిష్ణారావు అన్నారు. శుక్రవారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్ఆర్ చందూర్ జగతి ఎండోమెంట్ లెక్చర్‌లో 'పాత్రికేయం, సాహిత్యం-సామాజిక దృక్పథం' అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవ, దళిత, స్త్రీ ఉద్యమాలు జర్నలిజంపై ఎంతో ప్రభావాన్ని చూపాయన్నారు. గతంలో పత్రికలు గ్రాంధిక భాషలో ఉండేవన్నారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి పంతులు భాషకోసం ఎనలేని పోరాటాలు జరిపారన్నారు. గిడుగు రామమూర్తి వ్యావహారిక భాషలో పత్రికను నిర్వహించారన్నారు. తాపి ధర్మారావు, నార్ల వెంకటేశ్వర రావులు తెలుగు భాష, పత్రికలకు చేసిన కృషిని వివరించారు. సమాజాన్ని అధ్యయనం చేసి కవులు రచనలు చేస్తారన్నారు. జర్నలిజం విలువలు సాహిత్యం నుంచి వచ్చాయన్నారు. భాష, సాహిత్యాల ప్రభావం, భావజాల ప్రభావాలను వివరించారు. శ్రీశ్రీ రచనలు ఒక విప్లవాన్ని తీసుకువచ్చాయన్నారు. పోతన నుంచి శ్రీశ్రీ వరకు వచ్చిన రచనలు చదవడం, తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు.రావిశాస్త్రి న్యాయవ్యవస్థను తన రచనల్లో తూర్పారబట్టారని, పతంజలి రచనలు పరిశీలిస్తే జర్నలిస్టుగా గమనించిన అంశాలను రచనలుగా జరిపారన్నారనేది స్పష్టమవుతోందన్నారు. అక్షర జ్ఞానం పొందడానికి నిరంతరం కృషిచేయాలన్నారు.

భారత దేశంలో సైన్స్ అభివృద్ధి చెంది నశించి పోయిందా అనే సందేహం వ్యక్తం అవుతోందన్నారు. ప్రశ్నించడంతోనే పాత్రికేయుల మనుగడ ముడిపడి ఉందన్నారు. సాహిత్యం ప్రశ్నించడాన్ని ప్రోత్సహిస్తుం దన్నారు.

మాజీ రాజ్య సభ సభ్యులు, విశ్రాంత ఆచార్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ జన్మనిచ్చిన అమ్మను, వ్యక్తిగా తీర్చిదిద్ది సమాజానికి అందించిన విశ్వవిద్యాలయాన్ని మరువలేనన్నారు. తాను విద్యార్థిగా ఉన్న కాలంలో నిర్వహించిన స్మారక ప్రసంగాలు తమ జ్ఞాన సముపార్జనకు ఉపకరించాయన్నారు. అదే ఉద్దేశంతో నేడు వర్సిటీలో స్మారక, ధర్మనిధి ప్రసంగాలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు.

వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మాటల్లో, రాతల్లో క్లుప్తత, స్పష్టత కలిగి ఉండటం నేడు ఎంతో అవసరమన్నారు. స్మారక, ధర్మనిధి ప్రసంగాలు ఏర్పాటుకు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ చేస్తున్న సహకారం నిరుపమానమన్నారు. జర్నలిజం విభాగాధిపతి ఆచార్య పి.బాబి వర్ధన్ మాట్లాడుతూ ఎన్.ఆర్ చందూర్ జగతి పత్రికను ప్రారంభించి ఐదు దశాబ్ధాలు పాత్రికేయునిగా సేవలు అందించారన్నారు.

యువత పాత్రికేయులకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారన్నారు. ఆయన పేరుతో నేడు ప్రసంగం ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. జర్నలిజం, సాహిత్యం కవలలు వంటివన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో సాహిత్యం, పాత్రికేయం కలసి సాగాయన్నారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు, పాలక మండలి సభ్యులు ఆచార్య ఎన్.బాబయ్య, జర్నలిజం ఆచార్యులు డి.వి.ఆర్ మూర్తి, డాక్టర్ చల్లా రామక్రిష్ణ, రామక్రిష్ణ, ఎన్ఆర్ చందూర్ కుటుంబ సభ్యులు తదితరులు,పిడిఎఫ్ డాక్టర్ జి.కె.డి ప్రసాద్, పరిశోధకులు, విద్యార్థులు, ఆచార్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వర్సిటీ తరపున ఏ.క్రిష్ణారావును సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

# కస్తూరి వెంకట ఆనందరావుకు వర్సిటీ డాక్టరేట్

## అభినందించిన వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వ విద్యాలయం న్యాయకళాశాల పరిశోధక విద్యార్థి కస్తూరి వెంకట ఆనందరావుకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. కళాశాల ఆచార్యులు దాసరి సూర్య ప్రకాశ రావు పర్యవేక్షణలో 'భారత రాజ్యాంగ చట్టం ద్వారా మానవ హక్కుల అమలు- ఒక చట్టపరమైన అధ్యయనం' అంశంపై డాక్టరేట్ చేశారు. వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు తన కార్యాలయంలో ఆనందరావుకు ఉత్తర్వులు అందజేసి అభినందించారు.

తన పరిశోధనలో భాగంగా మానవ హక్కులు ప్రజోపకరమైన హక్కులుగా ఎంత ఉన్నతమైనదో, ప్రాధమిక హక్కులు కూడా మనిషికి అత్యంత ఉపయోగకరమైనవనీ వెనుక బడిన తరగతుల స్థితిగతులను మార్చేందుకు, వాటిని మరింత పదునుపరచేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో సమగ్రంగా వివరించారు.

ఆనందరావు భారతీయ స్టేట్ బ్యాంక్‌లో 42 సంవత్సరాలు సేవలు అందించారు. 72 సంవత్సరాల వయసులో ఆయన తన పరిశోధన జరిపారు.గతంలో ఆనందరావు ఎల్ఎల్ఎం, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ సోషియాలజీ, ఎంఏ ఫిలాసఫీ, ఎంఏ సైకాలజీ, ఎంఏ సంసృతం, ఎంఏ జ్యోతిష్యం, కోర్సులతో పాటు ఏయూలో నటన, దర్శకత్వంలో పీజీ డిప్లమో కోర్సులను సైతం చేయడం జరిగింది.

# జగన్ రాజ్యంతో రాష్ట్ర అభివృధి.. విజయసాయిరెడ్డి



అరకులోయ : రాజ్య సభ సభ్యులు విజయసాయి రెడ్డి శుక్రవారం అరకులోయ కొత్తబల్లుగుడ కొర్రుగుడ పర్యటన సంధర్భంగా అరకులోయ తాజామాజి సమన్వయ కర్త సివేరి.దొన్నుదొర ఆయనతో కలసిన అనంతరం జగన్ అన్న వస్తేనే తప్ప రాష్టం అభివృధి చెందుతుంది అన్నారు గతంలో రాజశేఖర్ రెడ్డి గారు ఉన్నప్పుడు రాష్టంలో పేద ప్రజలకు అన్ని రకాలుగా ఆదుకున్నారు అన్నారు అలగే అరకులోయ మన్యం ప్రాంతం బాగ నేటికి అభివృధి చెందలేదు ఈ కొర్రుగుడ గ్రామంలోనె ఇన్ని సమస్యలు ఉంటే మిగతా గ్రామాల పరిస్తితి ఇంకా ఎలా ఉందో చూడండి సార్ అని దొన్నుదొర రాజ్య సభ సభ్యుడు విజయ సాయిరెడ్డి కి వివరించారు. అరకులోయ నియోజక వర్గంలో దొన్నుదొర రాజ్యం కావాలి రాష్టంలో జగన్ రాజ్యం అయితేనే బాగుంటుంది అని అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదవాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత ఎన్టీఆర్



అనకాపల్లి : పేదవాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత ఎన్టీఆర్ అని పార్లమెంట్ సభ్యులు అవంతి శ్రీనివాసరావు అన్నారు. 23వ వర్ధంతి కార్యక్రమాలు అనకాపల్లి పట్టణంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు, అభిమానులు నిర్వహించారు. ఎంపీ అవంతి శ్రీనివాసరావు, అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవిందసత్య నారాయణ ఎన్టీఆర్ జంక్షన్‌లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం కార్యకర్తలను అభిమానులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలుగుజాతికి వెలుగు తెచ్చిన మహానాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. మృతి చెంది 23 ఏళ్లు అయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, చెప్పారు. రెండు రూపాయలు కిలో బియ్యం ఆడవారికి ఆస్థి హక్కు, తినడానికి తిండి కట్టుకోవడానికి బట్ట ఉండటానికి ఇళ్లు పేదవారికి అందించిన ఘనత ఎన్టీ రామారావుకే దక్కుతుందని అన్నారు. ఆయన ఆశయ సాధనకు కార్యకర్తలు నిరంతరం పనిచేయాలని అన్నారు. రాబోయే ఎన్నికలలో తెలుగుదేశంపార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. 75 రూపాయలు ఫించను ప్రవేశపెట్టిన ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుతం ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రెండు వేల రూపాయలకు తీసుకువెళ్లారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ పట్టణ అద్యక్షులు డాక్టర్ కెకెవిఎ నారాయణరావు, జిల్లా పార్టీ ప్రదాన కార్యదర్సి బుద్ద నాగజగదీష్, అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర, నూకాంబిక దేవస్థాన మాజీ చైర్మన్ కొణతాల వెంకటరావు, కాండ్రేగుల సత్యవతి, కొణతాల రత్నకుమారి, గుత్తా ప్రభాకర చౌదరి, బొలిశెట్టి శ్రీనివాసరావు, పలక సత్యనారాయణ, పిట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# 38 వ రోజుకు చేరిన దీక్షలు



అనకాపల్లి : టి. వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67,68 లో గల భూమిలో సాగు రైతులకు పరిహారం చెల్లించాకే భూములు సేకరించాలనే డిమాండ్ తో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 38వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వం కూడా బతికి బట్టకట్టిన చరిత్ర లేదన్నారు. ముఖ్యంగా రైతులకు ఇవ్వాల్సిన పరిహారం కాజేయాలని కుట్ర పన్నిన ఎమ్మెల్యే పీలా గోవిందుకు టి. వెంకుపాలెం రైతుల ఉసురు తగలక మానదన్నారు. బాధ్యత గల అధికారులు కూడా ఈ విషయంలో ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అలాంటి చర్యలు మానుకుని, వారి కున్న అధికారాలతో వెంటనే అర్హులైన వారికి పరిహారం చెల్లించాలని సీతారాం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ ఉమర్, దాడి బుజ్జి, సురభి హరీష్, గల్లా వినోద్, మళ్ల రాజా, రైతులు కుండల లోవరాజు, ఉరుకూటి అప్పారావు, బోర రాజు, ఉరుకూటి బాబూరావు, ఉరుకూటి సింహాద్రి పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## మారని చదువులు

ప్రథమ్ సంస్థ ఏటా వెల్లడిస్తున్న విద్యాస్థితి నివేదిక క్షేత్రస్థాయి వాస్తవాలకు నిలువుటద్దంగా నిలిచింది. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెరిగిన తీరు కొంతఊరట కలిగించింది. అయితే విద్యా ప్రమాణాల విషయంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నది. పదాలు, వాక్యాలు చదువగలిగే విద్యార్థుల సంఖ్య గతంలో కన్నా మరింత తగ్గిందని యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్(అసర్) వెల్లడించింది. దేశవ్యాప్తంగా 596 జిల్లాల్లోని మూడు నుంచి పదహారేండ్ల వయసున్న ఐదు లక్షలకు పైగా విద్యార్థుల పై విద్యా ప్రమాణాల విషయంలో చేసిన అధ్యయనంలో తేలిన ఈ చేదు నిజాలు మన విద్యావ్యవస్థ దురవస్థను చాటి చెబుతున్నది. 2007తో పోలిస్తే బడిలో చేరని పిల్లల సంఖ్య మూడు శాతం తగ్గింది. కానీ విద్యా ప్రమాణాల్లో మాత్రం 2.8 శాతం పడిపోవటం దిగ్భ్రాంతికరం. అస ర్ అధ్యయనం ప్రకారం- ఐదవ తరగతి విద్యార్థుల్లో రెండవ తరగతి స్థాయి పాఠ్యాంశాలు చదువగలిగే విద్యార్థులు 2016లో 47.1 శాతం ఉంటే, 2018 నాటికి అది 43.6 శాతానికి పడిపోయింది. 8వ తరగతి విద్యార్థుల్లో 76.1 శాతం నుంచి 69.5 శాతానికి పడిపోవటం ఆందోళన కలిగించేదే. మెరుగైన విద్యా ప్రమాణాలకు ఉపాధ్యాయుల నియామకమే కీలకం. కానీ దేశవ్యాప్తంగా ఉన్న 13 లక్షల పాఠశాలల్లో 10.3 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే లోపం ఎక్కడ ఉన్నదో తెలుస్తున్నది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, వారి పని విధానం కారణంగానే పల్లె నుంచి పట్టణాల దాకా ప్రాథమిక స్థాయిలో పిల్లల చదువుల కోసం తల్లిదండ్రుల ప్రైవేట్ బాట పడుతున్నారు. తాజా అసర్ అధ్యయనం ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు చదువులో మెరుగైన స్థితిలో ఉండటం గమనార్హం. అసర్ రిపోర్టు వెలువడిన రెండు మూడు రోజులు దేశవ్యాప్తంగా చదువుల స్థితిగతులపై చర్చ జరుగటం, ఆ తర్వాత ఆ విషయాన్ని మర్చిపోవటం పరిపాటి అయ్యింది. గత కొన్నేండ్లుగా ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఏటా పాఠశాల విద్యపై అధ్యయన రిపోర్టును వెలువరిస్తూ విద్యా ప్రమాణాల్లో ఉన్న దీన స్థితిని చెబుతూనే ఉన్నది. ఏడెనిమిది తరగతుల విద్యార్థులు సైతం కనీస కూడికలు, తీసివేత లెక్కలు చేయలేని దుస్థితిని చెబుతూనే ఉన్నది. అక్షరాలను గుర్తించి చదువలేని స్థితిని చూపు తూ మన చదువుల దీన హీన స్థితిని గురించి హెచ్చరిస్తూనే ఉన్నది. అయినా విద్యాప్రమాణా ల్లో గుణాత్మక మార్పుల్లో అడుగు ముందుకు పడటం లేదు. మరోవైపు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవటం, ఉపాధ్యాయుల కొరత తదితర అంశాల నెపంతో అసలు సమస్యను దాటవేసే ధోరణి సాగిపోతున్నది. మన దేశీయ సంప్రదాయ విద్యా క్రమాన్ని, ప్రైవేట్ విద్యాసంస్థల తీరుతెన్నులను చూస్తే, విద్యాప్రమాణాలకు మౌలిక వసతులు, సమస్యలు అసలు అవరోధాలే కావని తేటతెల్లమవుతుంది. విద్యా విషయ సమస్య అంతా చదువులు చెప్పే బోధకుల్లోని నిబద్ధతలో ఉన్నది. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లటానికి ఉపాధ్యాయుల తీరు తెన్నులే కారణమని అనేక అధ్యయనాలు చెప్పాయి. పనిచేసే చోటనే ఉండకపోవటం, తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపటం లాంటి చర్యలతో ప్రజలకు ప్రభుత్వ బడులపై పూర్తిగా విశ్వాసం సన్నగిల్లింది. తాజా నివేదికలో ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాల్లోనే కన్నా ప్రభుత్వ బడుల్లోనే విద్యాప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని తేలింది. అందరికీ విద్య లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయి. ప్రత్యేక కార్యాచరణలతో విద్యావ్యాప్తికి కృషిచేస్తున్నాయి. అయితే ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందాలంటే పేద, ధనిక తేడా లేకుండా అందరికీ ఒకే బడి విధానం అవసరమని కొఠారీ కమిషన్ సూచించింది. కామన్ స్కూల్ విధానంతోనే విద్యాప్రమాణాల్లో విప్లవాత్మక మార్పులకు అవకాశముంటుందని విద్యావేత్తలు ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోంచే అలహాబాద్ హైకోర్టు నిర్దేశాలు గమనించదగ్గవి. ప్రభుత్వ ఖజానా నుంచి ఆర్థిక ప్రయోజనాలు పొందే ప్రతి ఒక్కరూ అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా తమ పిల్లల్ని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరించేవారు ప్రైవేట్ పాఠశాలలకు ఫీజుల రూపంలో ఎంత మొత్తం చెల్లిస్తారో, అంతే మొత్తాన్ని ప్రభుత్వానికి జమ చేయాలి. ఆ మొత్తాన్ని ప్రభుత్వ బడుల్లో చేరిన పిల్లల మౌలిక అవసరాల కల్పనకు ఖర్చు చేయాలని అలహాబాద్ హైకో ర్టు సూచించటం గమనించదగ్గది. సరిగ్గా ఈ స్ఫూర్తికి అనుగుణంగానే తెలంగాణ ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్యతో పాటు, సంక్షేమ హాస్టళ్లన్నింటిలో మెరుగైన పౌష్టికాహారం అందిస్తున్నది.

### విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని పలు వార్డులలో

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



మల్కాపురం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని పలు వార్డులలో స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వర్ధంతి వేడుకలకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాలకు, ఏన్టీఆర్ చిత్రపటాలకు నూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ తెలుగువారు అప్యాయంగా అన్న అని పిలుచుకనే ఎన్టీఆర్ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసి దేశ నాయకుడైయ్యాడని, మహిళలకు కూడా ఆస్తి హక్కు కల్పించి మహిళల అభివృద్ధికి తోడ్పడిన గొప్ప వ్యక్తి అని అన్నారు. 1982లో టీడీపీ పార్టీని స్థాపించి రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నేడు రాజకీయవ్యవస్థకు తెలుగువారి సత్తా చాటిన మహెూన్నతమైన పెన్నిధి ఎన్టీఆర్ అని అన్నారు.

ఈ సందర్భంగా 49వ వార్డులో వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేష్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అలాగే 47వ వార్డులో వంశీకిషోర్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి వేడుకల్లో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్టిమూర్తి, రేవళ్ల సత్యనారాయణ, కొత్తపల్లి ప్రభావతి, కోలాటి శంకరరావు, జయశంకరరావు, మజ్జి మాలినాయుడు, కోరుబిల్లి రాము, టీడీపీ కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## తెరాసలో చేరిన వంటేరు ప్రతాప్‌రెడ్డి

### గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్

హైదరాబాద్: కాంగ్రెస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి తెరాసలో చేరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. ప్రతాప్‌రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఆయన మూడుసార్లు పోటీ చేశారు. 2014, 2018 ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆహ్వానం మేరకు తాను తెరాసలో చేరానని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికార పార్టీలో చేరుతున్నట్లు వంటేరు చెప్పారు.

ఒంటేరు ప్రతాప్‌రెడ్డి తెరాసలో చేరుతారని ఆయన కుమారుడు నిన్నే ప్రకటించారు. అయితే అవన్నీ ఊహాగానాలని, ప్రతాప్‌రెడ్డిని తెరాసలోకి ఎవరూ ఆహ్వానించలేదని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. పార్టీలోకి ఆయన వచ్చినా రానివ్వబోమని వ్యాఖ్యానించారు. ఈనేపథ్యంలో తెరాసలో తాను చేరుతున్నట్లు వంటేరు ఈ ఉదయం స్వయంగా ప్రకటించి తాజాగా పార్టీలో చేరారు.

# మమతా బెనర్జీకి రాహుల్ గాంధీ లేఖ

దిల్లీ: పశ్చిమ్‌బంగ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ లేఖ రాశారు. రేపు కోల్‌కతాలో మమతా బెనర్జీ ఆధ్వర్యంలో జరగనున్న యునైటెడ్ ఇండియా ర్యాలీకి మద్దతిస్తూ రాహుల్ లేఖ పంపారు. మరికొన్ని నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భాజపా వ్యతిరేక పార్టీలన్నీ కలిసి రావాలంటూ మమత ర్యాలీకి ఆహ్వానించారు. ఈ ర్యాలీకి రాహుల్ మద్దతు ప్రకటించారు. మమతా దీ అని సంబోధిస్తూ ఆయన లేఖ రాశారు.

మమతా దీకి నేను మద్దతిస్తున్నా. యునైటెడ్ ఇండియా ర్యాలీ.. పార్టీల ఐక్యతను చాటడమే కాకుండా బలమైన సందేశాన్ని పంపుతుందని ఆశిస్తున్నా అని రాహుల్ లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, లౌకికవాదం అనే స్తంభాలపైనే అభివృద్ధి, నిజమైన జాతీయత ఉంటుందని నమ్మి అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకమవుతున్నాయని ఆయన అన్నారు. భాజపా, మిస్టర్ మోదీ వాటిని నాశనం చేశారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం నకిలీ హామీల కారణంగా కోట్లాది భారతీయులు ఆగ్రహం, నిరాశలో ఉన్నారని ఆరోపించారు.

శనివారం కోల్‌కతాలో జరగనున్న యునైటెడ్ ఇండియా ర్యాలీకి రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు హాజరుకావడం లేదు. కాంగ్రెస్ తరపున మల్లికార్జున్ ఖర్గే, అభిషేక్ మను సింఘ్వీలు హాజరుకానున్నారు. అలాగే బీఎస్పీ అధినేత్రి మాయావతి కూడా ఈ ర్యాలీకి వెళ్లడం లేదు. ఆమె తరపున పార్టీ నేత సతీష్ మిశ్రా వెళ్లనున్నారు. రేపటి ర్యాలీకి మాజీ ప్రధాని దేవె గౌడ, ఆయన కుమారుడు కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజస్వి యాదవ్ హాజరుకానున్నారు.

## తిరుగు ప్రయాణంలోనూ రద్దీ

చౌటుప్పల్ : సంక్రాంతి పండుగకు వెళ్లిన రాజధాని ప్రజలు తిరుగుబాట పట్టడంతో, గురువారం చౌటుప్పల్ పట్టణంలో బారులుదీరిన వాహనాలు ఇవి. విపరీత రద్దీని నియంత్రించేందుకు పోలీసు అధికారులు, జీఎమ్మార్ సిబ్బంది పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు ఎక్కువసేపు ఆగకుండానే వెళ్లాయి. భువనగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్, చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చేపట్టారు. హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో 11 టోల్ బూత్‌లు తెరిచారు. అదనంగా చేతి యంత్రాలతో జీఎమ్మార్ సంస్థ ఉద్యోగులు టోల్ రుసుములు వసూలుచేశారు. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద కూడా వాహనాల తాకిడి ఎక్కువగా కనిపించింది.

### సమయం కవి

## జ్ఞాన ప్రదాత

లే... మేలుకో...
నీ గమ్యం చేరేవరకూ విశ్రమించకు
అని స్వదేశంలో యువతను మేల్కొల్పి
మూఢత్వపు గోడలను పెకలించి
సమాజ శ్రేయస్సు కొరకు...
స్వార్థాన్ని విడనాడమని
యువతదే భవిత
అన్న ఉత్తేజాన్ని నింపి
ధృడ సంకల్పం
ఆత్మ విశ్వాసం కల యువత
భరతజాతికి అవసరమని
చాటి చెప్పిన మార్గదర్శి...
మానవజాతిలో
వైషమ్యాలు తొలగింప
విశ్వమత సభలో
ఓ... నా... సోదర సోదరీమణులారా...
అన్న ఆత్మీయ పిలుపుతో
పాశ్చాత్యుల హృదయాలను గెలుచుకొని
హైదవ సంస్కృతి
మానవజాతి అనుసరించవలసిన
జీవన విధానమని
విదేశాలలో ఉద్బోదించిన
జ్ఞాన ప్రదాత...
స్వామి వివేకానంద

...కవితా రచన
ఆర్.శంకర్
సెల్ నెం: 9849213779

## పంచాంగం

మాసం : పుష్య; తిథి : త్రయోదశి ప.3.45; మృగశిర ఉ.8.51; సా.వ.4.50ల6.21 | శనివారం 19 -01 -2019

a **మేషం** : ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయ వలసి వస్తుంది. ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపా రాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది.

b **వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది.

c **మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు.

d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

e **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయా ణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

f **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. g **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవ ములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది.

h **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులను చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

i **ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

j **మకరం** :ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి.

k **కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, అప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. మీ ఏమరుపాటుతనం, హడావుడి వల్ల వస్తు వులు చేజార్చు కుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారు లను ఆకట్టు కుంటారు.

L **మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది.










రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## కాలువలపై సిమెంట్ పలకల ఏర్పాటు

పరవాడ:పరవాడ గ్రామంలో జగన్నాథం వీదిలో గెడ్డం సురేష్ ఇంటి వద్ద నుంచి చుక్క సన్యాసిరావు ఇంటి వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న కాలువలపై గోడలు కట్టి వాటిపై సిమెంట్ పలకలను శనివారము ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో స్థానికంగా ఉన్న కుటుంబాలు ఇటుక, సిమెంటు,ఇసుక సొంతంగా ఏర్పరిచారు. ఇటువంటి కార్యక్రమాలు అందరు కలిసి చేయడం ఆనందంగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైల పోతినాయుడు (పెద్దింటి), చుక్క సన్యాసిరావు, పైల హరీష్ , గెడ్డం రమణ, చుక్క అప్పలనాయుడు, చుక్క వెంకటరావు, పైల చినబాబు, చుక్క చిన్నోడు, దేముడు బాబు ప్రజలు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ పనిచేస్తుంది

### మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి



యలమంచిలి : స్వర్గీయ అన్న ఎన్టీ రామారావు ఏ ఆశయంతో తెలుగుదేశం పార్టీని స్థాపించారో నేడు అదే పేద ప్రజల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. శుక్రవారం స్వర్గీయ ఎన్టీ రామారావు వర్థంతి సందర్భంగా యలమంచిలిలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్ర హానికి రమాకుమారి, టిడిపి నాయకులు పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ కార్యదర్శి పిట్టా శ్రీను, ఆడారి శ్రీధర్, బుడ్డోడు సురేష్, నాగిరెడ్డి శ్రీని వాస్, మళ్ల కొండబాబు, రమణ, పండూరి శ్రీనివాస్, గోపి, పెంటయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాడవాడలా ఘనంగా ఎన్టీఆర్ 23వ వర్ధంతి వేడుకలు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న బండారు

సబ్బవరం : వాడవాడలా ఎన్టీఆర్ 23వవర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని అంతకాపల్లి పంచాయితీలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు మిడతాడ మహలక్ష్మినాయుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గణపతిపురంలో రేషిపూడి రమణ ఆధ్వర్యంలో అసకపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సబ్బవరం మండల కేంద్రంలో మూడురోడ్ల కూడలిలో వున్న ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వర్ధంతి వేడుకలకు ఎమ్మెల్యే బండారు ముఖ్య అతిధిగా పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంటరాగార అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ పేదల ఆశాజ్యోతి అని, పేదల పెన్నిధి అని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాలకను గుణంగా నడుచుకోవాలని ప్రజలను కోరారు. ఆనాడు ఎన్టీఆర్ కరణం మునసబు వ్యవస్థ లను రద్దు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. పింఛన పథకాన్ని వృద్ధులకు రూ.200ల నుండి రూ.1000లు, ఆ తరువాత రూ.2000లు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కేసీఆర్‌తో చేతులు కలిపిన జగన్ రాష్ట్రానికి ద్రోహం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశానికే ఓటు వేయాలని ప్రజలను కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో గండి దేముడు, గండి ముత్యాలు నాయుడు, మిడతాడ మహలక్ష్మినాయుడు, శరగడం శంకరరావు, బంగారు నాయుడు, గవర అప్పారావు, కొత్తూరు గెడ్డప్ప, బొండా సత్యారావు, బోకం అర్జునుడు, బోకం శ్రీరామమూర్తి, ఎం.సూర్యనారాయణ, కొటాన వెంకటరమణ, పల్ల తాతారావు, రేషిపూడి రమణ తదితరులు పాల్గొన్నారు.

## సింహాచలంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



సింహాచలం : 72వవార్డు సింహాచలం మార్కెట్ ఏరియాలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 23 వర్ధంతి వేడుకలు టీడీపీ అర్బన్ ఉపాధ్యక్షుడు పాశర్ల ప్రసాద్ పిసినివరహా నరసింహం టీడీపీ నాయకుడు కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కర్రి అప్పలస్వామి స్వామి శిబిరములలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులంతా నివాళులు అర్పించి ఎన్.టి .ఆర్ అమర్ హే అని నినాదం చేశారు. 72వవార్డు పరిధిలో వున్నా నిరు పేదలకు కర్రి స్వామి అధ్వర్యంలో 200 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే 1000 మందికి పులిహోర స్వీట్స్ పంపిణి చేసారు అలాగే పిసినివరహానరసింహం ఆధ్వ ర్యంలో పేదలకు పులిహోర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్.టి .ఆర్ ఆశయ సాధన కై ప్రతి ఒక కార్యకర్త కృషి చేయాలని అయన అడుగుజాడలలో ప్రతీ కార్యకర్త నడుస్తూ పార్టీని మరింత ముందుకు నడపాలానికోరారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులూ గూసిడి శంకరరావు,తోమురోతు రాంబాబు, లంక సత్తిబాబు పంచదార్ల శ్రీనివాస రావు లండ శ్రీను గుసిడి బాబు సొసైటీ ఉపాధ్యక్షులు యెర్ర వరాహ నరసింహం ,రాజనాల సత్యారావు గంటల కిరణ్ బాబు సతివాడ శంకర్రావు ,ముగ్గు కిరణ్ , మజ్జి సూరి బాబు కొరడా ఈశ్వరరావు కొలుసు గురునాధ్ లోగిశ గణేష్, జన్మ భూమి కమిటీ సభ్యులు ఎన్ అప్పారావు మేకల కాసు గోపాల్‌తో పాటు మజ్జి కోటి, కొలుసు రామారావు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## పరవాడలో ఎన్టీపీసీ సహకారముతో వాటర్ ప్లాంట్ ప్రారంభం



పరవాడ:మండలకేంద్రమైన పరవాడలో సియస్అర్ నిధులు 11.10లక్షలుతో నిర్మించిన నీటిశుద్ధికేంద్రాన్ని శుక్రవారము ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్థానిక శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి హజరై అయన చేతులు మీదుగా ప్రారంభించారు. అనంతరము అయన మాట్లడుతూ ఎన్టీపిసి సేవలును కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపిసి జిజిఎమ్ ఎఅర్ మైతి,హెచ్ అర్ రాంబాబు, జిల్లాప్రాదేశిక సభ్యులు పైలజగన్నాదరావు, ఎంపిపి మాసవరపు అప్పల నాయుడు, అర్‌డబ్లూయస్ ఎఇ షణ్ముఖ, వర్క్ఇన్స్ ఫైక్టర్ పైల రమణ,మాజీ సర్పంచ్ చుక్కరాము నాయుడు, ఎంపిటిసి సభ్యులు సిరపురపు అప్పలనాయుడు, అటవీ శాఖ డైరక్టర్ మాదంశెట్టి నీలబాబు, చింతకాయల ముత్యాలు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పైల రామచంద్రరావు, జన్మభూమి కమిటీ మెంబర్ రెడ్డిశ్రీనువాసురావు, బొండా సన్నిదేముడు తదితరులు పాల్గొన్నారు.

## పేదల కళ్ళల్లో వెలుగులు నింపడమే ఎంపిఎం ట్రస్టు ధ్యేయం

### ఉచితంగా కళ్ళజోడును పంపిణీ చేసిన శ్రీభరత్



విశాఖపట్నం: ఆర్థికంగా వెనుకబడి కనీసం వైద్యలయాలకు కూడా వెళ్ళలేని పరిస్థితులలో ఉన్న పేదలకు స్వర్గీయ ఎంవివిఎస్.మూర్తి నెలకొల్పిన ఎంపిఎం ట్రస్టు అండగా నిలుస్తుందని, వారు నివసించే చోటికే అన్ని వైద్యసేవలను ఉచితంగా అందిస్తుందని, గీతం అధ్యక్షుడు శ్రీ భరత్ పేర్కొ న్నారు. నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా ఎన్‌టిఆర్ సేవా సమితి, ఎంపిఎం ట్రస్టు సంయుక్తంగా శుక్రవారం స్థానిక సత్యం కంప్యూటర్ జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించు కున్న వారికి ఉచిత కళ్ళజోడును పంపిణీ చేశారు.

మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతిరోజున తన తాత ఆశయాలను కొనసాగించే కార్యక్రమంలో పాల్గొనడం ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పైడా ముత్యాల నాయుడు, ధర్మ, నజీర తదితరులు పాల్గొన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి వైద్య బృందం ఆధ్వర్యంలో కంటి అద్దాల పంపిణీతో పాటు నేత్ర పరిరక్షణకు సూచనలు తెలిపారు.

## ఎన్టీఆర్‌కి ఘన నివాళి



మధురవాడ : తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 23వ వర్ధంతిని పురస్కరించుకొని పీఎం పాలెం క్రికెట్ స్టేడియం ఎన్టీఆర్ విగ్రహం వద్ద శుక్రవారం టీడీపీ పార్టీ నాయకులు ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమానికి హాజరైన భీమిలి నియోజక వర్గ ఇంచార్జి చిక్కాల విజయబాబు పూలమాల వేసిన అనంతరం మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేతగ అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అమలుపరచిన పథకాలు ఎనలేనివన్నారు , రాష్ట్ర ఉన్నతకి ఎన్టీఆర్ ఎంతో కృషిచేశారని నాల్గొవర్డు అధ్యక్షడు సోం బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీను, గోలగాని సన్యాసిరావు, పాతిన ప్రసాద్, బోయే వెంకట రమణ, రమాదేవి, షైక్ జహానారా, దాసరి అనురాధ తదితర నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### దేవరాపల్లిలో దళితుల నిరసన

దేవరాపల్లి : మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారం లో దళిత యువకులపై దాడి చేసి ,అంబేద్కర్ విగ్రహన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తు దేవరాపల్లిలో దళితులు నిరసన తెలిపారు .స్థానిక అంబేద్కర్ యూత్ సంఘము, కెవిపిఎస్ అధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ,పూలమాలలు వేసి నివాళి అర్పించారు .అనంతరం నాలుగు రోడ్ల కడలిలో మనవహారం గా ఏర్పాడి పలు నినాదాలు చేశారు .ఈ సందర్భంగా కె వి పి ఎస్ జిల్లా. నాయకులు కాటపల్లి అప్పారావు మాట్లడుతూ రాజ్యంగా నిర్మాత డా బి అర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులపై ఎస్ సి .ఎస్ టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినముగా శిక్షిం చాలని డిమాండ్ చేశారు .లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు టి .ఈశ్వరరావు, సి హెచ్ .రాజు ,దళిత నాయకులు కాటపల్లి దేముడు, అచ్చిబాబు ,కంకడల సన్నిబాబు, ఎస్.మాలి బాబు, కె.అప్పారావు ,కొండలరావు,చింతాలు ,రవి తదితరులు పాల్గొన్నారు



గ్రేటర్ విశాఖ, 15వవార్డు టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీఆర్ 23వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి పాలాభిషేకం చేశారు. ఎన్టీఆర్ జోహార్, జోహార్ అంటూల నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ శివప్రసాద్, కోటేశ్వరరావు, శంకరరావు, కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు లోక్ నాయక్ ఫౌండేషన్ అవార్డుల ప్రదానోత్సవం



విశాఖపట్నం : స్వర్గీయ నందమూరి తారక రామారావు స్వర్గీయ హరివంశ రాయ్ బచ్చన్‌ల వర్ధంతులను పురస్కరించుకుని లోక్ నాయకం ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కళా భారతిలో నేడు అంపశయ్య నవీన్‌కు లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డును ప్రదానం చేయనున్నట్లు రాజ్యసభ మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యార్లగడ్డ మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాలుగా ఈ అవార్డులను సాహిత్యం, కళలు, సేవ తదితర అంశాల్లో ప్రావీణ్యం పొందిన వారికి ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి అతిథిగా జస్టిస్ జాస్తి చలమేశ్వర్, లావు నాగేశ్వరరావు, ఎ.కృష్ణారావు తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో యన్.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



మహా విశాఖ 5వ వార్డు టీడీపీ అధ్యక్షడు పిళ్లా నరసింగరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది స్థానిక పార్టీ కార్యకర్తలు నాయకులూ పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పిళ్లా వెంకట రావు, పాతిన వెంకట రావు, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు,

## నేడే కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర



యలమంచిలి, యలమంచిలిలోని ధర్మవరం వీధిలో వేంచేసి ఉన్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంతోపాటు పురవీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కాలేజీ రోడ్డు, క్లబ్ రోడ్డు, యలమంచిలి మెయిన్ రోడ్డు విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నాయి. రేపు నిర్వహించే జాతరను అంగరంగ వైభవంగా జరిపేందుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేసారు. వేల సంఖ్యలో ప్రజలు తరలి రానున్నారు ఈ సందర్భంగా పలు నేలవేషాలు, కోలాటాలు, బండ్ల వేషాలు, ఇతర సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయ నున్నారు. దాదాపుగా పది స్టేజిలను నిర్మిస్తున్నారు. రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించే ఈ జాతరకు ఇప్పటి నుంచే పలువురు వర్తకులు స్టాల్స్ ఏర్పాట్లు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఆట బొమ్మలు, అలంకరణ సామగ్రి, గృహో పకరణాలు తదితర దుకాణాలు ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. సుమారు 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ జాతర జిల్లాలో ప్రసిద్ధి చెందింది అధిక సంఖ్యలో తరలివచ్చే ప్రజలు ఏవిధమైన ఇబ్బం దులు తలెత్తకుండా, అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఇప్పటికే సర్కిల్ పరిధిలోని పలు స్టేషన్ల నుంచి పోలీసు బలగాలను యలమంచిలి తరలిస్తున్నారు.

## బాదంతో ఈ ఏడాదంతా ఆరోగ్యమే

విశాఖపట్నం : బాదంతో ఈ ఏడాదంతా ఆరోగ్యంగా జీవించడానికి సరికొత్త తీర్మానాలు చేసుకోవాలని ప్రముఖ ఆహార నిపుణురాలు రితికా సమద్దార్ ఒక ప్రకటనలో అన్నారు. ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యకరమైనవి తినాలి అని 2019లో తీర్మానాలు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా వుండాలంటే మనం తీసుకునే స్నాక్స్ గురించికూడా ఆలోచన చేయాలని అన్నారు. ఆహారానికి ఆహారానికి మధ్య బాదం పప్పు తీసుకుంటే ఆకలి తీరడంతో పాటు ఆరోగ్యానికి బాటలు వేసినట్లేనని అన్నారు. విటమిన్ ఈ, కాల్షియం, కొవ్వులు, పీచు పదార్థాలు బాదంలో ఉండడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. దీంతో రోజంతా ఆరోగ్యంగా వుండడానికి అవకాశం వుంటుందని తెలిపారు. గుప్పెడు బాదం గింజలు అనగా 30 గ్రాములు లేదా 23 బాదం రోజంతా తినడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని పేర్కొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

కంచరపాలెం : స్థానిక జీవీఎంసీ 41 వార్డు ఐటి ఐ జంక్షన్ కూడలి వద్ద వార్డు టిడిపి అధ్యక్షుడు పెంటకోట త్రినాథ్‌రావు ఆధ్వర్యములో ఎన్టీఆర్ వర్ధనతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం పూలమాలలు వేసి అంజలి ఘటించారు. తదనంతరం జోహార్ జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెంటకోట వరలక్ష్మి, టిడిపి వార్డు నాయకులు పెంటకోట అజయ్ బాబు, కుట్టా కార్తిక్, అధిక సంఖ్యలో మహిళలు స్థానికులు పాల్గొన్నారు.

## పద్మనాభంలో ఘనంగా ఎన్టీఆర్ 23వవర్ధంతి



భీమునిపట్నం : పద్మనాభం మండలం పద్మనాభం గ్రామం టి.డి.పి. పార్టీ కార్యాలయం లో ఎన్టీఆర్ 23వ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం రక్తదానశిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నగేష్ కుమార్, జెడ్పిటిసి దామోదర్‌రావు, కురుమిన లీలావతీ ఎమ్.పి.టి.సి లు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కో-ప్రొడ్యూసర్ కావలెను
త్వరలో మేము ప్రతిష్టాత్మకంగా నిర్మించబోవు సూపర్ స్టార్ చిత్రానికి రూ. 5 లక్షల నుండి 15 లక్షల వరకు పెట్టుబడి పెట్టగల కో-ప్రొడ్యూసర్ కావలెను.
9553245023, 9581991533

### బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన భీశెట్టి వెంకటరావు S/o. బి.బబులు, నివాసం: డోర్.నెం.39-8-59/10, వాకర్స్ పార్క్, మురళీనగర్, విశాఖపట్నం వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం, ఇందుమూలంగా ప్రజలు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు ఇంటి డోర్.నెం.35-21-10, కంచరపాలెం తాలుకు ఓరిజనల్ డాక్యుమెంటు హక్కు విడుదల దస్తావేజు నెం. 2251/1997 మరియు మురళీనగర్ గల ఇంటి డోర్ నెం.39-8-59/10 తాలుకు డాక్యుమెంటు జెరాక్స్, కెనరా బ్యాంకు A/c.No.24341011005728, గల Cheque Book No.021601 to 021610, I.T. Returns 2013 to 2018 యొక్క జెరాక్స్, LIC Premium Paid Receipts 2 years Paid కరెంట్ బిల్లులు, లేబర్ ఫర్మ్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డ్ జెరాక్స్, పాన్ కార్డు జెరాక్స్, 5000/-క్యాష్, కారు key తో సహా తేది: 21-11-2018న మాధవధార, బిర్లా జంక్షన్, వాటర్ ట్యాంక్ దరి, వంశీనగర్‌లో వున్నటువంటి నా క్లయింటు యొక్క శ్రీమణీ సప్లయర్స్ షాపు వద్ద పైన ఉదహరించినవి అన్నియు బ్యాగ్‌తో పోయినవి.

కావున **ఓరిజినల్ డాక్యుమెంటు నెం.2251/97,** Cheque Book మరియు పైన తెలిపినవి అన్నియు బ్యాగ్‌తో దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చగలరు. అందజేసిన వారికి తగు పారితోషికం ఇవ్వబడును.

అట్లుకాకుండా ఈ ఓరిజినల్ క్రయ దస్తావేజులను ఎవరైననూ ఉపయోగించి ఎటువంటి తనఖాలు, క్రయ అగ్రిమెంట్లు, గిఫ్ట్‌లు మొదలైనవి దురుద్వేశపూర్వకముగా చేసిన యెడల అవి ఏవియు చెల్లనేరవు మరియు ఎటువంటి అన్యాక్రాంతములకు పాల్పడిన యెడల చట్టరీత్యా నా క్లయింటు తీసుకొనుబోవు సివిల్/క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు. నా క్లయింటు హక్కులను ఏ విధంగాను బంధింపజాలవు అనియు ఈ ప్రకటన మూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
**SURAMPUDI SRINIVASA RAO**
**Advocate**
**D.No.39-1-34/2/1,**
**Singaraju Metta, Murali Nagar,**
**Visakhapatnam.**
**Cell: 9396444445 / 9849362601**

## ఉచిత మెగా గుండె వైద్య శిబిరం



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక పంచాయతీ వద్ద వరుపుల తమ్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కార్డియాలజీ (గుండె సంబంధిత వ్యాధుల) వైద్య శిబిరాన్ని డీసీసీబి చైర్మెన్,ఫౌండేషన్ అధ్యక్షులు వరుపుల రాజా ప్రారంబించారు. ఈ శిబిరములో ప్రముఖ గుండె సంభందిత వైద్య నిపుణులచే పరీక్షలు చేయించి మందులు ఉచితంగా పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షు డు వరుపుల.రాజా మాట్లాడుతూ ప్రతీ పేద, మధ్య తరగతి కు టుంబ సభ్యులు సంపూర్ణ ఆరో గ్యముతో ఉండాలన్నదే తమ ధ్యేయంఅని తెలిపారు. ఈ కార్య క్రమంలో పర్వ త. సురేష్, టౌన్ టీడీపీ అధ్యక్షుడు వీర్ల. సూరి బాబు, మండల ప్రెసిడెంట్ బద్ది. రామారావు, వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి. సత్యనారా యణ, రాజాల. చిట్టిబాబు, పలివెల.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలింతలకు గిఫ్టుల పంపిణి

యానాం: నియోజకవర్గంలోని 260 మంది బాలింతలకు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు గిఫ్టులు పంపిణీచేశారు. శుక్రవారం సాయంత్రం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద సాంఘిక సంక్షేమశాఖ ఏర్పాటుచేసిన బేటీబచావో బేటీ పడావో కార్యక్రమంలో పిల్లలకు పోషకాహారంతో కూడిన కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేసి పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వరకట్నం దురాచారం రూపుమాపకపోవడం వలన బార్యభర్తలు గర్భంలో ఉండగానే బాలికలను పుట్టకుండా చేస్తున్నారని దీనివలన భవిష్యత్‌లో బాలికలు లేని సమాజంగా తయారయ్యే ప్రమాదం రానున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. సమాజంలో స్త్రీ, పురుషులకు సమానంగా అన్ని హక్కులు ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా కొందరు తప్పుడు సలహాలమేరకు ఇటువంటి ఘటనలకు పాల్పడటం సమంజసం కాదన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వం బాలింతల సంక్షేమానికి నిధులు కేటాయిస్తుందన్నారు. గర్భిణీగా ఉన్నప్పడే అన్ని వైద్య సదుపాయాలు ఉచితంగా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఇద్దరు బాలికలు పుడితే ప్రభుత్వం వారికి బ్యాంకులో ఒక్కొక్కరికి రూ. 10 వేలు డిపాజిట్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారి చింతా రామజోగి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## 33వ రోజుకు చేరిన సొసైటీ ఉద్యోగుల సమ్మె



కాట్రేనికోన : సొసైటీ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె నేటికి 33వ రోజుకు చేరుకుంది. సహకార సంఘంలో ఖాళీలను సంఘ ఉద్యోగులతో భర్తీ చేయాలని కోరుతూ 33 రోజుల నుండి ఆందోళన చేపట్టిన ప్రభుత్వం పట్టించుపోవడం చాలా దారుణమని సొసైటీ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యర్రంశెట్టి రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఐదు లక్షలు గ్రాట్యూటీ చెల్లించాలని పదవీ విరమణ వయస్సు 60 కి పెంచాలని సహకార సంఘం రైతులకు వడ్డీ రాయితీ ఆరు శాతం వర్తింపచేయాలన్నారు వేతన సవరణ 10 శాతం నుంచి 50 శాతానికి పెంచి 2014 నుంచి అమలు చేయాలని డీసీసీబీ ఐదో కేడర్ ఉద్యోగాల్లో ఖాళిలో 50 పిఎసిఎస్ ఉద్యోగుల్లో సీనియార్టీ ప్రాతిపదికన భర్తీ చేయాలని అన్నారు.

పీఆర్సి అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో సమ్మె చేస్తున్నామన్నారు.పిఆర్సి కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు సార్లు కమిటీ వేసిందని కమిటీ సభ్యులు కూడా ఉద్యోగుల అనుకూలంగా నివేదిక ఇచ్చారని రామచంద్రరావు తెలిపారు. ఈ సమావేశంలో పి వరహాలరాజు గోనెమడతల సత్య దంతులూరి రామకృష్ణంరాజు కొండేటి సత్యనారాయణ కోటిపల్లి శ్రీ రామప్రసాద్ సుధా వెంకటేశ్వరావు శంకర్ కృష్ణమూర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 21 నుండి ప్రజాపనులశాఖ ఇంజనీర్లు మాస్‌లీవ్‌లు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ప్రజాపనుల శాఖ ఇంజనీర్లుకు పదోన్నతలు కల్పించడంలో జాప్యంచేయడంపై నిరసిస్తు ఈనెల 21 నుండి మూకుమ్మడి సెలవులు పెడుతున్నట్లు పుదుచ్చేరి ప్రజాపనులశాఖ ఇంజనీర్ల అసోసియేషన్ పిలుపుమేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు దారా సుబ్బరాజు తెలిపారు. జెఇ నుండి ఇఇ వరకు పనిచేస్తున్న ఇంజనీర్లుకు పదోన్నతి కల్పించవలసిన అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణివలను సంవత్సరాలు గడిచిపోతున్నాయని తక్షణం పదోన్నతులు కల్పించాలంటూ పుదుచ్చేరి వ్యాప్తంగా మూకుమ్మడి సెలవులపై వెళ్ళనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావుకు వినతిపత్రంలో తెలియజేశామన్నారు. న్యూఢిల్లీలో పుదుచ్చేరి అతిధిగృహంలో విధులు నిర్వహిస్తున్న జెఇ వాసిరెడ్డి భగవాన్ మూకుమ్మడి సెలవుపెట్టినట్లు తెలిపారు.

## వారధిపై రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యానాం: జిఎంసి బాలయోగి వారధిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడిక్కడ మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం ఐపోలవరం మండలం కరవాకలంక గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వేరువేరుగా వాహనాలపై వివాహానికి వెళ్ళి ఇంటికి తిరిగి వెళ్తుండుగా బాలయోగి వారిధిపై అమలాపురం నుండి వస్తున్న ఒక వాహనం ఎదురుగా ఢీకొట్టడంతో మోర్త ధర్మారావు (29) అక్కడిక్కడ మృతి చెందగా మామిడాల రంగబాబు, వాకపల్లి సుదర్శనబాబులు తీవ్రగాయాలపాలయ్యారు. మోటారు వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. గాయాలపాలయ్యినవారిని హుటాహుటిన యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కొరకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఐ పోలవరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

## మీసేవ సమస్యలపై ర్యాలిని విజయవంతం చేయ్యాలి

కాట్రేనికొన : నేడు శనివారం అమలాపురం గడియారం స్తంభం వద్ద మీ సేవ ఆపరేటర్లు నిరసన ర్యాలీ ని విజయ వంతం చెయ్యాలని మీ సేవా కేంద్రాల జిల్లా నాయకులు మట్టపర్తి రవి తెలిపారు. కోనసీమ పరిధిలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు అమలాపురంలో జరిగే నిరసన ప్రదర్శనలు తరలి రావాలన్నారు. కాబట్టి మన డివిజను వారు తొమ్మిది గంటల సమయంకు అమలాపురం చేరుకోవలన్నారు. ఆయన వెంట కాశి శ్రీనివాస్ అడ్డేపల్లి వినోద్ గోనెమడతల కుమార్ కాశి మూర్తి జగదీష్ ఆనంద్, చినబాబు, వెంకట్ తదితరులున్నారు.

### వడిశల మురళి దాతృత్వం
## 100 మంది క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణి



అచ్చుతాపురం : వడిశల మురళి దాతృత్వం అభినందనీయమని అచ్చుతాపురం మండల అదనపు ఎస్ఐ మల్లేశ్వరరావు అన్నారు .శుక్రవారం మండలంలో చోడపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ వడిశల చోడప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వడిశల మురళి 100 మంది క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణి కార్యక్రమంలో ఆయన పాల్గొని పంపిణి చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఉజ్వల భవిష్యత్ ను ఇస్తాయని ,దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వడిశల శ్రీనివాసరావు ,వడిశల సురేష్, నాయుడుబాబు, వడిశల నాగేశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 23వ వర్ధంతి వేడుకలు



అన్నవరం :తూ.గో జిల్లా అన్నవరం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎన్టీఆర్ 23 వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి ముందుగా డిసిసిబి చైర్మన్ శ్రీ వరుపుల. రాజా అన్నవరం టౌన్ టిడిపి అధ్యక్షులు వీర్ల. సూరిబాబు మండల ప్రెసిడెంట్ బద్ది.రామారావు, వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి. సత్యనారాయణ, రాజాల. చిట్టి బాబు తదితరులు ఎన్టీఆర్ విగ్రహా నికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వరుపుల.రాజా, పర్వత.సురేష్, వీర్ల సూరిబాబు మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీ రామారావు ఎల్లప్పుడు పేదల కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అని అదే విధంగా బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలివెల.సతీష్, మడ్డు. వీరబాబు, రౌతులపూడి మండల ప్రెసిడెంట్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాట్రేనికొన లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం



కాట్రేనికోన : కాట్రేనికోన లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం మండల జడ్పీటీసీ సభ్యుడు నాగిడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిడి నాగేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన చేసిన సేవలు మరువలేనివని ఎన్టీఆర్ సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, విత్తనాలు బుజ్జి, మేకల మీరా సాహెబ్, ఆకాశం శ్రీనివాస్, చీకురుమిల్లి చక్రధరరావు, ఎంపిటిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## భీమిలిలో ఘనంగా ఎన్టీఆర్ 23వ వర్ధంతి



భీమునిపట్నం: తెలుగుదేశం పార్టీ వ్యవస్తాపకులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు 23వ వర్ధంతి సందర్భంగా భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు పాలు రొట్టెలు పంపిణీ చేసారు. అనంతరం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. భీమిలి బ్యాంకు కోలనిలో ఉన్న ఎన్ టి ఆర్ కు విగ్రహానికి, చిన్న బజార్ జంక్షన్ లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించి, అనంతరం ఎన్టీ ఆర్ జిందాబాద్ తెలుగుదేశం- వర్ధిల్లాలి ఎన్టీఆర్- అమరహే. అంటూ నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నియోజకవర్గ ఇంచార్జి చిక్కాల విజయ్ బాబు సమక్షంలో మంత్రివర్యులు గంటా క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘణంగా నివాళులర్పించారు. ఈ సంధర్భంగా డివిజన్ అద్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ పార్టీ పెట్టిన 9నెలలోనే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారని. తెలుగుదేశం పార్టీ పేదల పక్షపాత పార్టీగా ప్రతీ పేదవాడి గుండెల్లో ఉందని గంటా నూకరాజు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డి.ఎల్.డీ.ఏ. చైర్మన్ గాడు వెంకటప్పడు తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, గిడుతూరి శ్రీనివాసరావు, మారోజు సంజీవకుమార్, కనకల అప్పలనాయుడు, అప్పికొండ అప్పలనాయుడు, చురకల రమణ, కొండ్రు కృష్ణ, కొండ్రు శేఖర్, రాకోతు నర్సింగరావు, పైడిపల్లి ఎల్లయ్యమ్మ, కుప్పిల దుర్గ, పుక్కళ్ళ లక్ష్మీ కుమారి, దాసరి వెంకటేష్, దంతులూరి సిద్దార్ధ వర్మరాజు, బెల్లాన నూకరాజు, ఊళ్ల దుర్గారావు, కొక్కిరి అప్పన్న, బుత్తల అప్పారావు, మట్టా కొండ, మూగి రాజు, వంశీ, నెక్కళ్ళ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన నాయుకులు చిట్టివలస లో పాదయాత్ర



భీమునిపట్నం: చిట్టివలసలో భీమిలి జనసేన నియోజకవర్గ నాయకులు ఆలీవర్ రాయి ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర చెప్పటారు. స్థానిక శారదా స్కూల్ నుంచి ప్రతీ వీధి, ప్రతీ సందు, ప్రతి తలుపు తట్టి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు వివరిస్తూ విజన్ డాక్యుమెంట్ లో ఉన్న ప్రత్యేకతలు తెలియచేస్తూ సుమారు 2000 ఇళ్లను సందర్శించారు ఇందులో జనసేన సభ్యులు వంశీ, సతీష్, రాజు, లీలావతి తో పాటు సుమారుగా 60మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## తగరపువలసలో ఘనంగా ఎన్టీఆర్ వవర్ధంతి



భీమునిపట్నం: తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పలరమేష్ ఆధ్వర్యంలో స్థానిక రాజవీధి, బైపాస్ రోడ్డు లలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ అడుగు జాడలలో ప్రతీఒక్కరూ నడవాలని, ఎన్టీఆర్ పేద ప్రజలకు ఎన్నోసంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవ్వ వెంకటరావు, బోర సూర్యనారాయణ, చిలకానర్సింగరావు, తమ్మిన సూరిబాబు,పిట్ట వెంకటరావు, పిట్ట సూరిబాబు, కొప్పలకృష్ణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా గ్రంథాలయం నిర్మాణం చేపట్టాలని
## ఎన్.టి.ఆర్. విగ్రహానికి వినతి పత్రం



విశాఖపట్నం : స్వర్గీయ ఎన్.టి.ఆర్. వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆర్.కె. బీచ్ వద్ద గల ఎన్.టి.ఆర్. విగ్రహానికి పౌరగ్రంథాలయాల సేవా సమితి కార్యకర్తలు వినతి పత్రం సమర్పించారు. మహారాణి పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరం స్థలం అన్యాక్రాంతమైనందుకు ఆవేదన చెందుతూ, ముఖ్యమంత్రికి, విద్యామంత్రికి సద్బుద్ధి ప్రసాదించి గ్రంథాలయానికి ఆ స్థలం తిరిగి స్వాధీనం చేయాలని వెంటనే ఆ స్థలంలో ఆధునిక గ్రంథాలయ భవనం నిర్మించాలని వారు స్వర్గీయ ఎన్.టి.ఆర్. ను వేడుకున్నారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి ఇ.ఎ.ఎస్. శర్మ మాట్లాడుతూ ఎన్.టి.ఆర్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రంథాలయ విస్తర్ణకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చారనీ, తాను ఎన్.టి.రామారావు గారితో కలిసి పనిచేశానని, ఆయన తెలుగు భాష అభివృద్ధికి నిరంతరం కృషిచేసేవారని, తెలుగు యూనివర్సిటీని స్థాపించారని కొనియాడారు. కాని నేడు స్మార్ట్ సిటీగా పిలుచుకొనే విశాఖపట్నంలో ప్రభుత్వ గ్రంథాలయం లేకుండా చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కిందని ఆయన అన్నారు. గ్రంథాలయం స్థలం తిరిగి స్వాధీనం చేసుకొని ఆ స్థలంలో అత్యాధునిక గ్రంథాలయ భవన నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు.

పౌరగ్రంథాలయాల సేవా సమితి కార్యదర్శి బి.ఎల్.నారాయణ మాట్లాడుతూ, వాణిజ్యభవనం నిర్మించేందుకు దుర్మార్గమైన పిపిపి ఒప్పందం చేసుకున్నారని విశాఖ ప్రజానీకం చేసిన ఉద్యమాల ఫలితంగా ఆ ఒప్పందం 2014 సంవత్సరంలో రద్దు అయినా, ఈనాటికి ప్రత్యూషా కంపెనీ స్థలాన్ని తిరిగి జిల్లా గ్రంథాలయం సంస్థకు అప్పజెప్పలేదన్నారు. కార్యక్రమములో పౌరగ్రంథాలయాల సేవాసమితి కార్యదర్శి కె. త్రిమూర్తులు, కోశాధికారి పి. మల్లేశ్వరరావు, ఐద్వా నాయకులు పి.మణి, లోక్‌సత్తా నాయకులు ఎమ్.ఎస్.ఎన్. మూర్తి, హరిగణేష్, పారుపల్లి కోదండరామయ్య, సిపిఎం నాయకులు స్వతంత్రకుమార్, వి.కృష్ణారావు, వి.వి.శ్రీనివాసరావు, జి.వి.ఎన్.చలపతి, ఎం.సుబ్బారావు, ఆర్.పి.రాజు, గ్రంథాలయ సంస్థ ఫించన్‌దారుల సంఘం నాయకులు కె.అప్పారావు, ఎల్.ఐ.సి యూనియన్ నాయకులు ఎన్.రమణాచలం, కామేశ్వరి, కె.వి.రమణమూర్తి, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రాజోలు టిడిపి టిక్కెట్ రేసులో మోహన్ మాస్టారు



అమలాపురం : రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు నల్లి మోహనరావు (మోహన్ మాస్టారు) రాజోలు ఎస్.సి రిజర్వుడు శాసనసభ నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. విద్యార్థిదశ నుండి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించిన మోహనరావు ఉపాధ్యాయునిగా విధి నిర్వహణలో ఉంటూనే సామాజిక కార్యకలాపాల ద్వారా రాజోలు ప్రాంత ప్రజలకు సుపరిచితుడయ్యారు. ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యుటిఎఫ్)లో చేరి ఉద్యమ నాయకుడిగా ఎదిగారు. రాజోలు ప్రాంత యుటిఎఫ్ అధ్యక్షునిగా, జిల్లా కార్యదర్శిగా క్రియాశీలక పాత్ర పోషించారు. ఎపి ఎన్‌జివోస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఛైర్మన్‌గా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికే కాకుండా వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సమస్యలపై అనేక పోరాటాలలో పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారానికి కూడా ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో సంప్రదిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. 1983లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన మోహనరావుకు తెలుగుదేశం పార్టీ అన్నా, పార్టీ వ్యవస్థాపకులు, అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అన్నా విపరీతమైన అభిమానం.

ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రమ విధానం పట్ల కూడా మోహనరావు ఆకర్షితులయ్యారు. తెదేపా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళడంలో మోహన్ మాస్టారు నిరంతరం కృషి చేసే వారు. 26 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల యూనియన్ నాయకుడిగా పని చేసి మోహన్ మాస్టారుగా పేరు పొందిన ఆయన 2010 ఏప్రిల్ 19వ తేదీన ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి తెదేపా ముఖ్యులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, ఎ.వి. సూర్యనారాయణరాజు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, గొల్లపల్లి సూర్యారావు, రెడ్డి సుబ్రహ్మణ్యం తదితర ప్రముఖుల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుండి తెదేపా పార్టీ విధానాలు, ప్రభుత్వ విజయాలపై తనదైన శైలిలో ప్రచారం చేస్తూ ముందుకు సాగుతున్నారు. రాజోలు నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుండి ప్రతీ ఒక్కరితో సన్నిహిత సంబంధాలు ఉన్న మోహన్ మాస్టారు తన సన్నిహితుల సూచన మేరకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. పార్టీ ముఖ్యులందరినీ కలిసి తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

# నర్సీపట్నంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

## ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పించిన మంత్రి అయ్యన్న



నర్సీపట్నం : స్వర్గీయ నందమూరి తారకరామారావు 23వ వర్ధంతి కార్యక్రమాన్ని నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం సంతాప సభలో మంత్రి అయ్యన్న మాట్లాడుతూ యువత ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యువత ఎన్టీఆర్ జీవిత చరిత్ర తెలపడం కోసమే ఎన్టీఆర్ బయోపిక్‌ను బాలకృష్ణ చేశారన్నారు. కారణజన్ముడు రామారావు అయిన తో కలిసి ఆయన క్యాబినెట్‌లో కలిసి పని చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మహిళలకోసం ప్రత్యేక మైన గుర్తింపు ఇచ్చారు తిరుపతిలో మహిళలు కోసం పద్మావతి యూనివర్సిటీ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు, ఎంపిపి సుకల రమణమ్మ, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, నియోజవర్గంలో నాయకులు, కార్యకర్తలు పాల్గన్నారు. అదే విధంగా మున్సిపాలిటీలో 1వవార్డు పీనారిపాలెంలో వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఇరువర్గాలపై కేసు నమోదు

రావికమతం : కులం పేరుతో దూషించడమే కాకుండా ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారన్న ఫిర్యాదుపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు కొత్తకోట ఎస్సై శేఖరం తెలిపారు. ఎస్సై అందించిన వివరాల మేరకు కొత్తకోట గ్రామానికి చెందిన దందా ఏసు, ఎత్తుల అడవిరాజు గ్రామంలో ఆనందం షాపునకు వాటర్ ప్యాకెట్లకు వెళ్లారు. అదే సమయంలో గ్రామానికి చెందిన వెల్లంకి గణేష్, సత్తిబాబు, అడ్డూరి కిరణ్‌కుమార్ తదితర ఆరుగురు కూడా వెళ్లారు. ఈ సమయంలో నర్సీపట్నం నుంచి వస్తున్న ఆర్టీసి బస్సు రోడ్డు మార్జిన్ దిగడంతో అగ్రవర్ణానికి చెందిన వారి చేతులు, ఏసు, అడవిరాజులకు తగులడంతో వారు దుర్భాషలాడారన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగి కొట్లాటకు దారి తీసిందన్నారు. ఈ మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## చాసో కథ ఒక స్ఫూర్తి...ఆర్తి: డాక్టర్ కందిమళ్ల

విజయనగరం: కథలు, కథానికలలో మానవీయతను తెలిపిన కథకుడు చాగంటిసోమయాజులు (చా.సో) అని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. గురువారం రాత్రి చాసో 104వ జయంతి సభను చాసో స్ఫూర్తి సాహిత్య ట్రస్ట్ నిర్వహించిది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన దిశానిర్దేసం చేసి కాలానికి నిలిచిన కథలను తెలుగువారికి అందించారని తెలిపారు. కథలో భాష, భావాన్ని అతిక్రమించదని వివరించారు. అనితరమైన శిల్పవిన్యాసం ఒడిసిపట్టారని విశదీకరించారు. ప్రముఖ రచయిత్రి చాగంటి తులసి మాట్లాడుతూ కథలను నాటికలుగా చేయడంలో మార్పుకు అనుగుణంగా జరగాలని అన్నారు. ప్రతిఏటా చాసో అబ్యుదయ మార్గంలో కథలను రాసే రచయిత్రలలో ఉత్తమ కథకునికి స్ఫూర్తి అవార్డును ఇస్తున్నామని తెలిపారు. ఈ స భలో 24వ చాసో పురస్కార అవార్డును యువతరం రచియిత కొంపల్లి షరీఫ్‌ను ఎంపిక చేశారు. వీరు షేక్ ముహ్మద్ షరీఫ్‌గా నామకరణం చెందినా కొంపల్లి సురేష్‌గా వాసికెక్కారు. పురస్కారంతో పాటు 10వే రూపాయలు నగదు, జ్ఞాపికతో శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్ రెహన, రచయిత,గౌరీకృబానందన్ (చెన్నై), వి.దివాకర్, జె.ఎస్.చలం, చీకటి దివాకర్, ఆర్.బాలకృష్ణ తదితరలు పాల్గొన్నారు. తదుపరి బిహెచ్ విజయాదిత్య చాసో వజ్రహస్తం ఏకపాత్రాభినయం సభికులను అలరించింది.

# కఠిన చర్యలు తప్పవు: వన్డే వరల్డ్‌కప్ టికెట్ విక్రయాలపై ఐసీసీ

హైదరాబాద్: ఇంగ్లాండ్ వేదికగా ఈ ఏడాది మే 30 నుంచి ఐసీసీ వన్డే వరల్డ్ కప్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ వరల్డ్ కప్ కోసం అమ్మకానికి పెట్టిన టికెట్లన్నీ ఇప్పటి అమ్ముడుపోయాయి. ఈ టోర్నీ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆత ృతగా ఎదురుచూస్తున్నారు. ఈ టోర్నీ కోసం ఐసీసీ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో థర్డ్ పార్టీ టికెట్ అమ్మేవాళ్లపై కఠిన చర్యలు తీసుకొనేందుకు ఐసీసీ సిద్ధమైంది. వన్డే వరల్డ్‌కప్‌కి సంబంధించి ఇష్టమొచ్చినంత రీతిలో టికెట్ ధరలు పెంచి విక్రయించే వారిపై నిఘా పెట్టిన ఐసీసీ టికెట్ అమ్మకాలకు కచ్చితమైన రేటును నిర్ధారించే ప్లాట్‌ఫాంని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

"అక్రమంగా టికెట్లు అమ్మేవాళ్లపై ద ృష్టిసారించా. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటా%ఇ%. టికెట్లు అమ్మే థర్డ్ పార్టీ వ్యక్తుల నుంచి దూరంగా ఉండాలని అభిమానులను కోరుతున్నాం. అటువంటి వ్యక్తుల నుంచి టికెట్లు కొనుగోలు చేస్తే.. మీకు చాలా నష్టం జరుగుతుంది. అవి నిజమైన టికెట్లు కాకుంటే.. మీకు స్టేడియంలో ప్రవేశం ఉండదు" ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

టికెట్ కొనుగోలు చేసిన అభిమానులు మ్యాచ్‌కు వెళ్లలేక, వాటిని తిరిగి విక్రయించాలనుకుంటే.. దానిని ఐసీసీ ప్లాట్‌ఫాం ద్వారానే చేయాలని ఐసీసీ స్పష్టం చేసింది. ఇందుకోసం టికెట్ మాస్టర్ అనే సంస్థ ఈ ప్లాట్‌ఫాంని రూపొందించిదని ఐసీసీ తెలిపింది. దీనిని త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

## నాతవరంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



నాతవరం : నాతవరంలో శుక్రవారం దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 23 వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి శింగపల్లి సన్యాసదేముడు, జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, తాండవ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లాలం అబ్బారావులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పించారు. అనంతరం ఎన్టీఆర్ యొక్క ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ నందిపల్లి వెంకటరమణ, స్థానిక ఎంపీటీసీ అపిరెడ్డి మాణిక్యం, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ ఇటంశెట్టి దివాణం, మండల కోఆప్షన్ సభ్యుడు చీపురుపల్లి కల్యాణరాజు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇటంశెట్టి సీతారాం,మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు శెట్టి సత్యనారాయణ, గ్రామ పార్టీ సీనియర్ నాయకులు యర్రా కాశీ, బంగారు సూరిబాబు,నాతవరం మండల సోషల్ మీడియా ప్రతినిధి శెట్టి గోపి, మండల యూత్ ప్రధాన కార్యదర్శి శెట్టి లోవ, గ్రామ కార్యకర్తలు పైల రమణ, రామారావు, శెట్టి సత్యనారాయణ, పారుపల్లి దాసు అపిరెడ్డి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## హిమటాలజీ ఎనలైజర్ రక్త పరీక్షల పరికరం ప్రారంభం



విశాఖపట్నం: ప్రభుత్వ ఛాతీ అంటు వ్యాధుల ఆసుపత్రి - పెదవాల్తేరులో హిమటాలజీ ఎనలైజర్ రక్త పరీక్షల పరికరాన్ని ప్రారంభించిన నగర పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కె. హరిబాబు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిఎల్ఎడిఎస్ ద్వారా రూ. 5 లక్షలు శాంక్షన్ చేశామని దీంతో 15 నిమిషాలలో 18 రకముల రక్త పరీక్షలు చేయవచ్చునన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అభివృద్ధికి తనవంతు కృషి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఛాతీ ఆసుపత్రి అభివృద్ధి కమిటి వర్కింగ్ చైర్మన్ ఆర్. రవికుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. సాంబశివరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ నూకరాజు, డాక్టర్ పాత్రుడు, డాక్టర్ రజనీకాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ మరియు స్టాఫ్ పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ యుగపురుషుడు

## - ఎన్టీఆర్ వర్ధంతి సభలో తెదేపా నాయకులు



మాకవరపాలెం ; తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీరామారావు యుగపురుషుడని పీఏసీయస్ అధ్యక్షులు అల్లు రామునాయుడు అన్నారు. మండలంలోని శెట్టిపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్టీఆర్ 23వ వర్థంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ పార్టీ స్థాపించిన కొద్ది నెలలుకే అధికారం దక్కించుకొని రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. తెలుగు జాతికి జరుగుతున్న అన్యాయంపై పోరాడిన నాయకుడికి ప్రజలు బ్రహ్మారథం పట్టారన్నారు. నాటిపాలనను గుర్తు చేస్తూ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నారు. విశాఖడెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ 60 ఏళ్లుగా అభివృద్ధి కుంటుపడిన రాష్ట్రానికి ఆశాజ్యోతిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారని, భవిష్యత్‌లో మరిన్ని పథకాలకు తెలుగుదేశం పార్టీ శ్రీకారం చుడుతుందన్నారు. ఎన్టీఆర్ చేసిన పోరాటాలు, త్యాగలను రాష్ట్ర ప్రజలు ఎన్నడూ విస్మరించరని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోతల అప్పలనాయుడు అన్నారు. పాపయ్యపాలెం పంచాయతీ బుచ్చన్నపాలెంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు రుత్తల రమణమ్మ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచి చుక్కా పోతురాజు, తెదేపా నాయకులు రుత్తల వెంకటరమణ, వరహాలబాబు, లగుడు గోవింద తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్‌దారులకు చంద్రబాబు భరోసా

యలమంచిలి :పింఛన్ సొమ్ము పెంచుతూ పింఛన్‌దారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్థిక భరోసా ఇచ్చారని బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కె.దత్తాత్రేయ అన్నారు. ఇప్పటికే వెయ్యి రూపాయల ఇస్తున్న పింఛన్ రూ.2వేలకు పెంచడం ఆనందాయకరమని అన్నారు. ఈ పెన్షన్ పెంపు బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలకు వర్తిస్తాయని ప్రభుత్వం ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

## పశువులను వదిలేసే వారిపై చర్యలు తీసుకోవాలి

కొయ్యూరు : పశువులను పోషకులు వదిలేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని నడింపాలెం పంచాయతీకి చెందిన పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాజీ సర్పంచ్ సాంబశివరావు అధ్యక్షతన రైతులు సమావేశమయ్యారు. బట్టపనుకుల, నడింపాలెం, శరభన్నపాలెం గ్రామాల పరిధిలో చెక్‌డ్యాంల దిగువన రెండు గంటల సాగుకు అవకాశం ఉందన్నారు. పశువులు పంటలను నాశనం చేస్తున్నాయని, అధికారులు చర్యలుతీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని తీర్మానించారు.

# వాడవాడలా ఎన్‌టిఆర్ వర్ధంతి



రావులపాలెం : టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 23 వ వర్ధంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలో ఆయా గ్రామాల్లో పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, నాయకుల ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని జరుపుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు గుత్తుల పట్టాభిరామారావు, పొడగట్లపల్లిలో బండారు శ్రీనివాస్, లక్ష్మీపోలవరంలో మద్దుల సతీష్, గోపాలపురంలో మైగాపుల గురవయ్యానాయుడు, వెదిరేశ్వరంలో సయ్యపరాజు రామకృష్ణంరాజు, దేవరపల్లిలో వాసంశెట్టి రామకృష్ణ, రావులపాడులో పమ్మి శ్రీను, ఈతకోటలో యర్రంశెట్టి బుజ్జి, కొమరాజులంకలో గుర్రాల నాగభూషణం ల ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ 23 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భముగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సినీ రంగంలో తనకంటూ చెరగని ముద్ర వేసుకొని తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన ఏకైక వ్యక్తి ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ఈ సందర్భముగా వృద్దులకు, వికలాంగులకు, పేదలకు పండ్లు పాలు పంపిణీ చేసారు. అనంతరం నియోజక వర్గ టిడిపి పార్టీ పిలుపు మేరకు రక్తదానం చేసేందుకు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ పార్టీ నాయకులు కెవి రామిరెడ్డి, ఏరియా ఆసుపత్రి కమిటీ సభ్యులు అల్లూరి సత్తిరాజు, నామాల నాగేశ్వరరావు, ఏఎంసి డైరెక్టరు కోనాల వెంకట్రావు, జాలాది సహదేవుడు, గొర్రెల పటేల్, కుడుపూడి వెంకటేశ్వర్లు, నెక్కంటి వెంకన్న, మాసాబత్తుల ఆనందరావు, గాడి క్రిష్టాఫర్, వెలుగొట్ల త్రిమూర్తులు, గోపిశెట్టి సత్తిపండు, పోలవరపు శ్రీనివాస్, రాగి ఆంజనేయులు, దాసిరెడ్డి ఏడుకొండలు, కుంచనపల్లి గణపతి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్రభాను

# అజరామమయమైన భారత దేశ కీర్తి ....కోడి రామూర్తి..

## ( వర్ధంతి సందర్భంగా.... ఈ వ్యాసం)




విజయనగరం: అతను కదిలే రైలును...తాళ్ళతో కట్టి ఆపివేయ గలడు. వేలాది టన్నుల బరువును...అవలీలగా మోయగలడు. ఏనుగులను గుండెల మీద నిలబెట్టుకుని విన్యాసాలు చేయగలడు. అందుకే ఇండియన్ హెర్కులస్ అనే బిరుదును సొంతం చేసుకున్నాడు. అతని పేరే కలియుగ భీమ కోడిరాంమూర్తి నాయుడు. భారతీయులు గర్వించదగ్గ మల్లయోదుడు. మన తెలుగువాడు. 20వ శతాబ్ధం తొలిదశాబ్ధంలో ప్రపంచఖ్యాతి గడించిన అగ్రగణ్యుడు. పూర్తి శాఖాహారి. సాధారణ కాపు కుటుంబంలో కోడి వెంకన్న నాయుడు దంపతులకు 1882లో జనవరి 16వ తేదీన శ్రీకాకుళం జిల్లా వీరఘట్టంలో జన్మించాడు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన వీరు తండ్రి ఆజ్ఞతోనే నడిచారు. విజయనగరంలో ఉన్న తన పినతండ్రి కోడి నారాయణ స్వామి దగ్గరకు వచ్చారు. అక్కడ ఉన్న వ్యాయానశాలలో వారి సలహా మేరకు వ్యాయామం నేర్చుకున్నారు. దేహధారుడ్యాన్ని పెంచుకుంటూ కుస్తీ పట్లు నేర్చుకున్నారు. 21 ఏళ్ళ వయసులో రొమ్ముపై 1.5 టన్నుల భారాన్ని మోసి అందరినీ అబ్బురపర్చారు. తరువాత 3 టన్నుల బరువు మోసి గుండెల నిండా అందరికీ విశ్వాసాన్ని పెంచారు. శరీరానికి కట్టిన ఉక్కు గొలుసులను, ఊపిరితిత్తులలలో గాలిని పూక్తి చేసుకుని ముక్కలుముక్కలుగా త్రుంచేసేవారు. ఆ విన్యాసాలు చూడడానికి వ్యాయామశాల కిటకిటటాడేది. ఇక ప్రజలు వారి సాహసవాన్యాసాలను కథలుగా చెప్పుకుంటూ కలియుగ భీముడే అని వేనోళ్ళపొగిడేవారు. ఒకరోజు రెండు కార్ల భుజాలకు ఇనుపగొలుసులతో కట్టించుకుని కార్లని శరవేగంతో పోనియ్యమన్నాడు. డ్రైవర్ల సంకోచిసుంటే వారికి హామీ ఇచ్చాడు. ఒక్కసారి కార్లు వేగం పుంజుకున్నాయి. అయినా ఒక్క ఇంచీ కూడా కదలలేదు. తన చేతులలో ఉన్న తాళ్ళతో వాటిని నిర్భంధించాడు. ఇక ప్రజలు వారిని చూసేందుకే తండోపతండాలుగా వచ్చేవారు. ఇది తెలిసి లోకమాన్య బాలగంగాధర్ తిలక్ పూనా రమ్మని కబురుపెట్టేరు. వీరి ప్రదర్శనలు చూసి మల్ల మార్తాండ, మల్లరాజ తిలక్ అనే బిరుదులు ఇచ్చారు. రాంమూర్తిని విదేశాల్లో ప్రదర్శనలు ఇవ్వాలని ,పండిత మదన్ మోహన్ మాలవ్య రాంమూర్తిని ప్రోత్సహించారు. భారతప్రతిభ చాటాలని పలువురు కోరడంతో విదేశాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. అప్పటి బ్రిటీష్ వైస్రాయ్ లార్డ్ మింటో రామూర్తి ప్రదర్శనలు చూడాలని గట్టిగా పంతం సట్టి కోడిరాంమూర్తి రాక కోసం ఎదురుచూసేవాడు. ఎట్టకేలకు ప్రదర్శనలు చూసి ముగ్ధుడై తన కారును తాళ్ళతో ఆపాలని తానే డ్రైవింగ్ చేస్తానని కోరాడు. వారి కోరిక మేరకు కోడిరాంమూర్తి తాళ్ళను కారుకు తనకు కట్టుకుని సరే! అన్నాడు. కారు ఎంతో దూరం తీసుకెళ్ళగలను అనుకున్న వైస్రాయ్ విశ్వప్రయత్నం చేసి విఫలమయ్యాడు. ఇక కోడిరాంమూర్తిని ప్రశంసలతో ముంచెత్తి తన దేశమంతటా తిరగాలని కోరారు.లండన్‌లో రాజదంపతులు జార్జిరాజు, రాణి మేరి రాంమూర్తి ప్రదర్శనలు చూసి తన్మయులై అనేక కానుకలు సమర్పించారు. ఇక తమ బక్కింగ్ హోమ్‌కు ఆహ్వానించి ఎంతో గౌరవప్రదంగా సత్కరించారు. ఫ్రాన్స్, స్పెయిన్ దేశాలు వచ్చారు. ఈ దశలోనే స్పెయిన్ దేశంలో భీకరమైన కోడె పోరాటం( బుల్ ఫైయిట్) ప్రసిద్ధి చెందింది. రాంమూర్తిని అందులో పాల్గొనమని చాలామంది కోరారు. దాంతో వారి కోరిక మేరకు ఆ పోరాటంలో పాల్గొని సునాయాసంగా ఆ ఎద్దుల కొడె కొమ్ములను వంచి క్షణాల్లో క్రింద పడేశారు. స్టేడియం కరతాళ ధ్వనులతో రాంమూర్తిని ఉక్కిరిబిక్కిరి చేసింది. యోగశాస్త్రం, ప్రాణాయామం, జలవాయుస్థంబన, విద్యలను నేర్చుకున్నారు. తన కీర్తిని చూసి కొందరు అసూయాపరులు లండన్‌లో ఏనుగులతో విన్యాసం చేస్తుండగా ఒక బలహీనమైన చెక్కను అతని ఛాతిపై పెట్టారు. ఏనుగులు రొమ్మమీదకు ఎక్కగానే అది విరిగింది. దాంతో రాంమూర్తి ఎముకలు విరిగాయి. రెండునెలలు లండన్‌లో ఉండి తిరిగి దేశానికి వచ్చారు.

మరోసారి అతనిపై హత్యాయత్నం జరిగింది. మల్కానగరంలో విషప్రయోగం చేశారు. తను తిన్న ఆహారంలో విషం కలిపారు. అయితే తన యోగవిద్యతో దానిని అరిగించుకున్నారు. అయితే కాలిపై రాచపుండు లేచి చివరికి కాలుతీసేయవలసి వచ్చింది. వచ్చిన ధనమంతా వ్యాధి కోసం ఖర్చు అయింది. శస్త్ర చికిత్స చేస్తున్నప్పుడు మత్తు ఇంజక్షన్ వాడేవారు కాదు. ప్రాణాయామంతో నిబ్బరంగా ఉండేవారు. 1942 జనవరిలో విజయనగరంలో నిద్రలో ప్రాణాలు విడిచారు.

# ధోనీ మాయాజాలం

## ఆసీస్‌పై వన్డే సిరీస్ కైవశం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాపై పరిపూర్ణ విజయం. తొలుత 1-1తో టీ20 సిరీస్ సమం. తర్వాత 2-1తో టెస్టు సిరీస్ కైవశం. ఇప్పుడు 2-1తో వన్డే సిరీస్ భారత్ సొంతం. ఓ పటిష్ఠ జట్టుపై విదేశాల్లో టీమిండియా అన్ని సిరీస్‌లను కోహ్లీ నాయకత్వంలోనే అందుకోవడం అద్భుతం. నిర్ణయాత్మక చివరి వన్డే సాదా సీదాగా ఏమీ సాగలేదు. పిచ్ మందకొడిగా ఉండటంతో పరుగులు చేయడం కష్టమైంది. తొలుత మణికట్టు మాంత్రికుడు యుజువేంద్ర చాహల్ 6/42 చెలరేగడంతో ఆసీస్48.4 ఓవర్లకు 230 పరుగులు చేసింది. ఛేదనలో మహేంద్రసింగ్ ధోనీ (87; 114 బంతుల్లో 6/4), కేదార్ జాదవ్ (61; 57 బంతుల్లో 7/4) అజేయంగా నిలిచారు. నాలుగో వికెట్‌కు 116 బంతుల్లో 121 పరుగుల భాగస్వామ్యం అందించారు. విరాట్ కోహ్లీ (46; 62 బంతుల్లో 3/4) సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు.

**సమయోచితంగా కోహ్లీ..**

మందకొడి పిచ్‌పై టీమిండియా ఛేదనలో శుభారంభం దక్కలేదు. ఓపెనర్ రోహిత్ శర్మ (9; 17 బంతుల్లో 1స4) జట్టు స్కోరు 15 వద్దే వెనుదిరిగాడు. సిడిల్ వేసిన 5.6వ బంతికి షాన్ మార్ష్‌కు క్యాచ్ ఇచ్చాడు. అప్పుడు క్రీజులోకి వచ్చిన భారత సారథి విరాట్ కోహ్లీ అద్భుతమైన ప్రతిభ కనబరిచాడు. ఆచితూచి ఆడాడు. ఆసీస్ పేసర్లు రిచర్డ్సన్, స్టాన్‌లేక్ బంతుల్ని చక్కగా అడ్డుకున్నాడు. వారికి తోడైన స్పిన్నర్ జంపా బౌలింగ్‌లోనూ ఒక్కో పరుగు సాధించాడు. జట్టు స్కోరు 59 వద్ద ధావన్ (23; 46 బంతుల్లో)ను స్టాయినిస్ ఔట్ చేయడంతో ధోనీ క్రీజులోకి వచ్చాడు. ధోనీ, కోహ్లీ మూడో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం అందించారు. అర్ధశతకానికి చేరువైన విరాట్‌ను 30 ఓవర్ చివరి బంతికి రిచర్డ్సన్ పెవిలియన్ పంపించాడు. అప్పటి జట్టు స్కోరు 113.

**ధోనీ అండగా కేదార్ జాదూ..**

విరాట్ నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన కేదార్ జాదవ్ తొలుత పరుగులు చేసేందుకు కష్టపడ్డాడు. ఒక్కో పరుగు సాధించాడు. నిలదొక్కుకున్న తర్వాత బౌండరీలు బాదేశాడు. అప్పటికే క్రీజులో పాతుకుపోయిన మహేంద్రసింగ్ ధోనీ అర్ధశతకానికి చేరువయ్యాడు. చేయాల్సిన పరుగులు ఎక్కువ లేకపోవడంతో కఠినంగా వస్తున్న బంతుల్ని డిఫెండ్ చేశాడు. అనవసర షాట్లకు ప్రయత్నించలేదు. ఈ క్రమంలో జాదవ్, ధోనీ చెత్త బంతుల్ని వేటాడి బౌండరీకి తరలించారు. డ్రింక్స్ బ్రేక్ తర్వాత మహీ అర్ధశతకం సాధించాడు.

చివరి ఐదు ఓవర్లలో భారత్ 44 పరుగులు చేయాల్సి ఉండగా కేదార్ జాదవ్ సమయోచితంగా వరుస బౌండరీలు సాధించి అర్ధశతకం అందుకున్నాడు. సమీకరణం చివరి 12 బంతుల్లో 14 పరుగులుగా మారడంతో భారత్ విజయం ఖాయమైంది. స్టాయినిస్ వేసిన 49 ఓవర్‌లో 13 పరుగులు వచ్చాయి. 49.2వ బంతికి జాదవ్ బౌండరీ సాధించి విజయం అందించారు. చాహల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ధోనీ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అందుకున్నారు.

# విజయవంతంగా బెలూన్ పండగ

## బెలూన్ విహారం ఆద్యంతం ఆహ్లాదకరం



అరకులోయ : ప్రతీ ఏడాదిలాగానే ఈసారికూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బెలూన్ పండగ సక్సెస్ అయ్యింది. ఈ బెలూన్ పండగా వల్ల వేల సంఖ్యలో పర్యాటకులు వచ్చి ఈ సంతోషాన్ని సందడి చేసి వెళ్తారు. ఈ బెలూన్ పండగ వల్ల అరకులోయ ప్రాంతానికి పర్యాటకులు అధిక సంఖ్యలో రాకవల్ల ఈ ప్రాంతం ఇంకా అభివృధి చెందుతుంది. ఈ బెలూన్ పండగకి 15 దేశాల నుండి విదేశీయులు పాల్గొని 21 బెలూన్‌లను ఆకాశానికి ఎగిరించారు. మొత్తం ఈ పండగకి 5 కోట్లు రూపాయలు ప్రభుత్వం టూరిజం ఆధీనంలో ఖర్చు పెడుతోంది. గత ఏడాది కంటే బెలూన్ పండగ బాగా విజయవంతమయిందని పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు.

**ప్రతీ ఏడాది బెలూన్ పండగ**
**పర్యాటక శాఖ మంత్రి భూమ అఖిలప్రియ**

అరకులోయలో ప్రతీ ఏడాది బెలూన్ పండగ నిర్వహిస్తామని పర్యాటక శాఖ మంత్రి భూమ అఖిలప్రియ పత్రికల వారికి తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది బెలూన్ పండగ బాగా విజయవంతమయిందని చెప్పారు.

అలగే ఈ పండగ వల్ల దేశ వీదేశాల పర్యాటకులకు తెలిసి మరింత అభివృధి చెందగలదని అన్నారు.




# అప్పన్నహుండీ లెక్కింపు

## 1 కోటి 7లక్షల 78 వేల భారీ ఆదాయం



సింహాచలం : శ్రీ వరహాలక్ష్మీనరసింహస్వామి వారి హుండీ లెక్కింపు సింహగిరిపై శుక్రవారం దేవస్థానం అధికారులు చేపట్టారు. భక్తులు 25 రోజులుకు గాను కోటి ఏడు లక్షల డబ్భై ఎనిమిది వేల రూపాయలు నగదు రూపంలో చేకూరగా బంగారం 0.071. 800 గ్రాములు, వెండి 8.190.000 కేజీలు, విదేశీ కరెన్సీ యూ ఎస్ 233డాలర్లు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ 25 పౌండ్స్, బాంక్ అఫ్ మలేషియా 222 ఆర్ ఎం, సింగపూర్ 10 డాలర్లు, కువైట్ 1 దినర్స్, యూ ఏ ఈ 45 ఆరమ్స్. నేపాల్ 15 రుపీస్, ఆస్ట్రేలియా 20 డాలర్స్ చేకూరాయి. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది మరియు స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు సైన్యంలో ఉద్యోగాలు : బీజేపీ

న్యూఢిల్లీ : మిలిటరీ పోలీస్ కార్ప్స్‌లో పర్సనల్ బిలో ఆఫీసర్ ర్యాంక్ (పీబీఓఆర్)లో మహిళలకు ఉద్యోగాలివ్వాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్ణయించినట్లు బీజేపీ ఓ ట్వీట్‌లో తెలిపింది. ఇది చరిత్రాత్మక నిర్ణయమని, మహిళలకు ఇటువంటి ఉద్యోగాలు ఇవ్వడం ఇదే మొదటిసారి అని తెలిపింది. సాయుధ దళాల్లో మహిళలకు మరిన్ని అవకాశాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఇది మరొక మైలు రాయి అని పేర్కొంది. పీబీఓఆర్ సిబ్బంది నేరాల దర్యాప్తుకు సంబంధించిన విధులు నిర్వహిస్తారు. అత్యాచారాలు, లైంగిక వేధింపులు, దొంగతనాలు వంటి నేరాలపై దర్యాప్తు చేస్తారు. పోలీసుల సహకారం అవసరమయ్యే మిలిటరీ ఆపరేషన్స్‌లో పాల్గొంటారు.

## గీతంలో ఘనంగా

# ఎన్‌టిఆర్ వర్ధంతి



సాగర్‌నగర్ : గీతం విశ్వవిద్యాలయంలో శుక్రవారం స్వర్గీయ డాక్టర్ నందమూరి తారకరామారావు విగ్రహనికి గీతం విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా దేశానికి ఎన్‌టిఆర్ చేసిన సేవలను గుర్తుచేసారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నతమైన వ్యక్తి అని, స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించడంతో పాటు సమాజంలో ఉన్నతమైన స్థానం కల్పించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, గీతం ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, ప్రొఫెసర్ ఎస్.గణపతి, రాజేంద్రప్రసాద్ కేంపస్ ఆఫీసు ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర బదిలీల గడువు 6 నెలలు పెంపు

అమరావతి : రాష్ట్ర విభజన నేపథ్యంలో స్థానికత ప్రాతిపదికన పరస్పర అంగీకార బదిలీలు, భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో ఉండాలన్న నిబంధన మేరకు ఏపీ, తెలంగాణ మధ్య ఉద్యోగుల బదిలీకి అవకాశం కల్పించారు. ఈ గడువు 2018 డిసెంబరు 31తో ముగిసింది. దీనిని 2019 జూన్ 30 వరకు పెంచుతూ స్టేట్ రీఆర్గనైజేషన్ ఎక్స్ అఫీషియో ముఖ్యకార్యదర్శి ప్రేమ్‌చంద్రారెడ్డి మెమో జారీ చేశారు.

# మీరు త్వరగా కోలుకోవాలి

## సనపలకు విజయసాయిరెడ్డి పరామర్శ



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల చంద్రమౌళి అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి శుక్రవారం సనపల చంద్రమౌళిని తన నివాసంలో కలిసి పరామర్శించారు. త్వరలోనే కోలుకొని పార్టీ కార్యక్రమాలలో యదావిధిగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

చంద్రమౌళిని పర్మార్శించిన వారిలో వైఎస్ఆర్ సీపీ నగర అధ్యక్షుడు మళ్ళ విజయప్రసాద్, పార్లమెంటు అధ్యక్షుడు తైనాల విజయకుమార్, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కెకె రాజు, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకటరావు, రాష్ట్ర అదనపు కార్యదర్శులు పక్కి దివాకర్, జి. రవిరెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి ఆళ్ల శివగణేష్, నగర యువజన అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ, ఉత్తర నియోజకవర్గం యువజన అధ్యక్షుడు నంబాళ్ల ఈశ్వరరావు, 39వ వార్డు అధ్యక్షురాలు పప్పల సునీత, పేడాడ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

### విశాఖ ఉక్కు కర్మాగారంలో

# బ్లోపైప్ పేలి ప్రమాదం



ఉక్కునగరం: విశాఖ ఉక్కు కర్మాగారంలో సాంకేతిక కారణాలతో శుక్రవారం ఉదయం ప్రమాదం సంభవించింది. కర్మాగారంలోని బ్లాస్ట్ ఫర్నేస్ - 3లో బ్లో పైప్ పేలింది. దీంతో ఒక్కసారిగా ఫర్నేస్ నుంచి పెద్ద ఎత్తున మంటలు, ముడిసరకు బయటకు వెలువడ్డాయి. మంటల ధాటికి సమీపంలో ఉద్యోగులు నిలిపి ఉంచిన ఏడు ద్విచక్ర వాహనాలు, ఇతర యంత్రాలు కాలిపోయాయి. వెంటనే సీఐఎస్ఎఫ్ ఫైర్ విభాగం అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఉద్యోగులు అల్పాహారానికి వెళ్లడంతో పెద్ద ఎత్తున ప్రమాదం తప్పినట్లు తెలిపారు. అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయం లేక సరైన నిర్వహణ లేకపోవడం వల్లే ఈ ప్రమాదానికి కారణమని ఆరోపణలు వెల్లువెత్తాయి. 24 గంటల్లో తిరిగి పని ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

# ఎన్టీఆర్ వర్ధంతి ఓ సంకల్పదినం

## రక్తదాన శిబిరాలు, సాంఘిక సంక్షేమ సేవా కార్యక్రమాలు



విశాఖపట్నం : మానవ జాతికి ఎన్టీఆర్ స్ఫూర్తిప్రదాత అని విశాఖ అర్బన్ జిల్లా టిడిపి అధ్యక్షుడు వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అన్న నందమూరి తారక రామారావు 23వ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం ఆర్‌కే బీచ్‌లో అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నేతలంతా ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశాఖ అర్బన్ జిల్లా టిడిపి అధ్యక్షుడు వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ దివగంత నేత, మాజీ ముఖ్యమంత్రి, అన్న ఎన్టీ రామారావు యుగపురుషుడని కీర్తించారు. ఆయన వర్ధంతి ఒక సంకల్పదినం కావాలని ఆయన కోరారు. ఆయన వర్ధంతి దినాన అనేక సేవా కార్యక్రమాలతో పాటు రక్తదాన శిబిరాలు కూడా నిర్వహించారు. ఈ శిబిరాలలో సుమారు 100 మంది కార్యకర్తలు రక్తదానం చేసి జయప్రదం గావించారు. ప్రతీ వార్డులలో పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ మరియు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు పిజివిఆర్ నాయుడు (గణబాబు), తూర్పు శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చోడె వెంకట పట్టాభిరామ్, మాజీ శాసనసభ్యుడు ఎస్ఎ రెహమాన్, గీతం యూనివర్సిటీ చైర్మన్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు భరత్, 19వ డివిజన్

మాజీ కార్పొరేటర్ ఆళ్ల శ్రీనివాసరావు, గొరైల సూర్యనారాయణ మాస్టారు, డబ్ల్యు భాస్కరరావు, పైలా ముత్యాలనాయుడు, పాసర్ల ప్రసాద్, ఇమంది రమణ, ఎర్నాకుల జగదీష్, కాళ్ల శంకర్, పి. అప్పన్న, ఈతలపాక సుజాత, దాసిన సత్యనారాయణ, గొర్లె అప్పారావు, పిసి అప్పారావు, షేక్ జహనారా, కొల్లి సింహాచలం, పాసర్లపూడి జాన్, ఎస్ఎ చినరెహమాన్, బుచ్చా రామిరెడ్డి, ఇరోతి చిన కుమార్, ఎ. జగదీష్, బంటుపల్లి సూర్యనారాయణ, అబ్దుల్ అనీఫ్, నడిగట్ల శంకరరావు, ముద్దాల స్వర్ణలత, షేక్ బాబ్జీ, వేణు గోపాల్, మైలపల్లి శ్రీను, నున్న నాగేంద్ర, పాడుగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.









VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com